బాలానంద

# బొమ్మల రామాయణం

Acc. No. 26018

125°/UDC
R01

పురాణపండ రంగనాథ్

నవరత్న బుక్ సెంటర్
ఏలూరు రోడ్, * విజయవాడ-520002

బాలానంద బొమ్మల రామాయణం
రచన : పురాణపండ రంగనాథ్

ప్రథమ ముద్రణ :
జనవరి-1999

ముఖచిత్రం లోపలి బొమ్మలు :
త్రిగుణ్

© ప్రచురణ హక్కులు :
శ్రీ వి. కె. ఆర్. మూర్తి (పబ్లిషర్)
H. No. 28-22-20 రహిమాన్ వీధి
అరండల్ పేట విజయవాడ-2
ఫోన్ : 432813

వెల : రు. 25-00

ప్రింటింగ్ :
బాలాజీ ప్రింటింగ్ ప్రెస్
విజయవాడ-4

## అమ్మకీ, నాన్నకీ...

వాత్సల్యాన్ని పంచి ఇవ్వడమే ఆమె నైజం.
గాంభీర్యాన్ని సంతరించడమే ఆయన రూపం.
నిరతాన్న దానశీలి మా అన్నపూర్ణమ్మ
నిరంతర పురాణ ప్రవచన తపస్వి మా నాన్న
శ్రీరామమూర్తి,
వాగర్థాలవంటి వారిద్దరికీ ఈ పుస్తకం
అంకితం చేస్తున్నాను.

—రంగనాథ్

# రామాయణ కథా క్రమం


అక్షర దీపిక

పాయస కలశం

బల, అతి బల

విరిగిన విల్లు

సీతా కళ్యాణం

చేదు మాటలు

గంగ దాటాడు

భరతుని నిరాహార దీక్ష

రాక్షస సంహారం

కపట సన్యాసి

శబరి

అగ్నిసాక్షిగా

వాలి వధ

లంకా దహనం

రామునితో స్నేహం

వంతెన

రావణ వధ

రామ రాజ్యం

కుశ లవులు

రామాయణ విజ్ఞానం

# అక్షర దీపం

రామాయణం రాముని కథ.

రాముడు ధర్మస్వరూపుడు. ఒక సాధారణ మానవునిగా, ఈ విశాల భూమండలాన్ని ఏలిన చక్రవర్తిగా, లక్ష్మణాదులకు అన్నగా, జానకిదేవికి భర్తగా, కౌసల్య మాతకు కుమారునిగా, సుగ్రీవాదులకు స్నేహితునిగా, ఆంజనేయాదులకు ఆరాధ్య దేవునిగా రాముడు తను చేయవలసిన పనులను, నెరవేర్చవలసిన కర్తవ్యాలను త్రికరణశుద్ధితో నిర్వర్తించాడు. అందుకే "రామో విగ్రహవాన్ ధర్మః" అని లోకం చేతులెత్తి మ్రొక్కింది. ప్రపంచం ఆయన దివ్య చరిత్రను వేనోళ్ళ గానం చేసింది.

ఉత్తరాన హిమాలయాల నుంచి, దక్షిణాన రామేశ్వరంవరకు, తూర్పున కటకం నుంచి పశ్చిమాన అటకం వరకు విస్తరించిన సువిశాల భారతదేశంలో అన్ని వర్గాల ప్రజలు, అన్ని వర్గాల జనులు రాముడిని కొలుస్తారు. రామాయణం భారతీయుల సాంస్కృతిక యేకత్వానికి సాహితీవారధి.

అటువంటి రామాయణాన్ని ఆదికవి వాల్మీకి సంస్కృతంలో వ్రాశాడు. ఆయన రామకథను వ్రాసేకాలం వరకు సంస్కృత భాషలో కావ్య సాహిత్యం ఉద్భవింపలేదు. అందుకే రామాయణం "ఆదికావ్యం" అయింది. వాల్మీకి "ఆది

కవి" అయ్యాడు. అక్షరోపాసకులకు ప్రాతఃస్మరణీయుడయాడు. కవితా శాఖను అధిరోహించి రామకథా గానం చేసిన కవికోకిల వాల్మీకి. వాల్మీకిలేని రామాయణం లేదు. రామాయణం లేనిదే రాముడు లేడు. రాముడు లేని భారతజాతి లేదు. యిలా వీరు భారతీయుల నిజ జీవితంలో పడుగు పేకలుగా అల్లుకుపోయినారు. మంచి పరిపాలనకు రాముడే ఉదాహరణ ఆదర్శవంతుడైన అన్నకు రాముడే ప్రతిరూపం. శీలవంతుడైన భర్తకు రాముడే సాకారం. మాట నిలుపుకొనే స్నేహ ధర్మానికి రాముడు విగ్రహరూపం. నమ్మి కొలిచిన వారి ఆపదలు గట్టెక్కించే ఇలవేలుపు శ్రీరామచంద్రుడే. ఆడి తప్పని ధర్మనిరతుడు రాముడు.

ఇన్ని ధర్మాలకు ప్రోది అయినవాడు కనుకనే రాముని కథ నాటికి నేటికి ఇంటింటా మననం చేయబడుతోంది. ప్రతి మనిషి హృదయంలో "రామనామదీపం" కాంతులీనుతోంది.

ఇంతగా మానవ జీవితాలను ప్రభావితం చేసిన ఈ రాముడెవరు? ఎప్పటి వాడు? రామాయణం జరిగిందా? లేక కట్టుకథా? ఇలాంటి ప్రశ్నలూ లేకపోలేదు. వాటికి రకరకాల సమాధానాలూ రాకపోలేదు.

వాల్మీకి రామాయణం వ్రాశాకనే రామకథ జరిగిందని కొందరు అంటున్నారు. ఇరవై నాలుగవ మహాయుగంలో త్రేతా, ద్వాపరయుగ సంధి కాలంలో రాముడు అవతరించాడని మరికొందరు అంటున్నారు. నాలుగుయుగాలు కలిస్తే ఒక మహాయుగం. కృత, త్రేతా, ద్వాపర, కలియుగాలు నాలుగు అని మనకు తెలుసు. ఇటువంటి నాలుగుయుగాలు కలిస్తే ఒక మహాయుగం. అటువంటి 23 మహాయుగాలు గడిచాక, ఇరవై నాలుగవ మహాయుగ పరిభ్రమణంతో త్రేతా, ద్వాపరయుగాల సంధి సమయంలో ఈ కథ జరిగిందనీ మరికొందరి అభిప్రాయం. అదేం లేదు. ఇది కట్టుకథ అని ఇంకొందరి వాదన.

రామాయణం జరిగిందో, జరగలేదో అనే విషయాన్ని పండితులకు వదిలి వేద్దాం. రాముడు ఆచరించి చూపిన ఆదర్శాలు మన జీవితాలకు ఎంతవరకు

ఉపకరిస్తాయనేది పరిశీలించాలి అప్పుడే రామాయణ కావ్య సార్థకం అవగతం అవుతుంది.

రామాయణ కథ "బాల, అయోధ్య, అరణ్య, కిష్కింధ, సుందర, యుద్ధ, ఉత్తర" అని యేడు కాండలు. మొత్తం రామాయణం శ్లోకాలు 24 వేలు. అనంతర కాలంలో దాదాపు యాభైనాలుగు ఆర్ష రామాయణాలు అవతరించాయి. ఆయా కాలాలలో కవులు, ఋషులు తమతమ భావనాపటిమను, కాల్పనిక సామర్థ్యాన్ని మేళవించి మూల కథలో మార్పులు, చేర్పులు చేసి వాటిని వ్రాశారు. అవన్నీ సంస్కృత రామాయణాలే. అధ్యాత్మ రామాయణం, అగ్నివేశ రామాయణం, ఆనంద రామాయణం, ఆశ్చర్య రామాయణం మొదలయినవి ఆర్ష రామాయణాలు. మహాకవి తులసీదాసు హిందీలో "రామ్‌చరిత-మానస్" పేరిట రామకథను అద్భుతంగా వ్రాశాడు. తెలుగులో తిక్కన నిర్వచనోత్తర రామాయణం భాస్కర రామాయణం, మొల్ల రామాయణం, రంగనాథ రామాయణం, కంకంటి పాపరాజు వ్రాసిన రామాయణం ప్రసిద్ధమయినాయి. అవన్నీ పద్యకృతులు.

ఆధునిక కాలంలో శ్రీపాద కృష్ణమూర్తిశాస్త్రి గారు పద్యరామాయణం వెలయించారు. విశ్వనాథ సత్యనారాయణగారు "రామాయణ కల్పవృక్షం" వ్రాసి "జ్ఞానపీఠ్" బహుమతిని పొందారు. మరెందరో పండితులు వచనంలో రామాయణం వ్రాశారు. అందరికీ వాల్మీకి రామాయణమే మూలాధారం. ఇలా ప్రాతఃస్మరణీయులయిన సాహితీ విధులందరికీ చిరపూజితుడయిన వాల్మీకికి నమస్కరించి యిక రామాయణం కథ చెప్పుకొందాం.

## వాల్మీకి కోకిల

యుగ యుగాలనాటి మాట.

భారతదేశంలో 'తమాసా' అనే నది ప్రవహిస్తుండెడిది. అక్కడే వాల్మీకి మహర్షి ఆశ్రమం వుండేది. ఆయనకు ఎందరో శిష్యులుండేవారు. వారిలో భరద్వాజుడు ఉత్తమ లక్షణాలుగల అంతేవాసి. అతను ఎప్పుడూ గురువుగారిని

విడిచిపెట్టేవాడు కాడు. ఆయనకూడా అతడిపట్ల ఎంతో వాత్సల్యంతో ఉండేవాడు. గురువుగారి అంతర్యాన్ని బట్టి భరద్వాజుడు సంచరిస్తుండేవాడు. శిష్యుని అభిమతాన్ని గుర్తించి వాల్మీకి జ్ఞానవిద్యాబోధ చేస్తుండేవాడు.

సూర్యోదయానికి ముందే నిదురలేవడం, కాలకృత్యాలు తీర్చుకొనడం కొంతసేపు తపశ్చర్య, ఆ పిదప వేదాంతం పాఠం, ఆపై అడవిలో తిరిగి ఆహారం సంపాదించుకొని, దొరికిన కంద, మూల ఫలాలతో ఆకలి తీర్చుకొనడం, మరల శాస్త్రాధ్యయనం, సాయంసంధ్యావిధి. రాత్రిపూట దర్శన పఠనం-ఇది మున్యాశ్రమాలలో నిత్యకృత్యం. ఈ క్రమానికి విఘాతం ఎన్నడు వచ్చేదికాదు. ఆ నాటి రుష్యాశ్రమాలు విద్యాబోధన కేంద్రాలు. శాస్త్రాధ్యయన నిలయాలు. ఇంచుమించు ఈనాటి విశ్వవిద్యాలయాలకు అవి సరిపోతాయి.

ఈ విధంగా అశేష శిష్యకోటికి వాల్మీకి కులపతి. ఒకనాడు ఆయన భరద్వాజుడు వెంటరాగా అడవిలో నడిచివెడుతున్నాడు. ఒకచోట చెట్టుపై రెండు క్రౌంచ పక్షులు సరదాలాడుకొంటున్నాయి. వాటిలో అన్యోన్య దాంపత్యం, మాలిన్యంలేని ప్రేమ, జంటవిడువని ఆరాధనా, అవి చూడముచ్చటగా ఉన్నాయి. వాటి కలకూజితం వీనుల విందుగా వుంది.

ఇంతలో ఒక కిరాతుడు నేటు వచ్చాడు. క్రౌంచపక్షులలో ఒక దానిని గురి చూశాడు. బాణం వదిలాడు. మగపక్షి గిలగిల తన్నుకొని విలవిల ఆర్తనాథం చేసి నేలకూలి ప్రాణాలు వదిలింది. ఆడపక్షి శోకానికి అంతేలేదు.

ఆ దృశ్యాన్ని చూసిన మహర్షి వాల్మీకి హృదయం ద్రవించింది. కంట నీరు స్రవించింది. నోట మాట కవితయై శ్లోకం ఆవిర్భవించింది.

"మానిషాద ప్రతిష్ఠాంత్వమ్
అగమ శ్శాశ్వతీ స్సమాః
యత్క్రౌంచ మిథునాదేకం
అవధీః కామ మోహితమ్"—

త్రికరణశుద్ధిగల మహర్షినోట యీ మాటలు వెలువడిన మరునిముషంలో బోయవాడు నేలకూలాడు. ప్రాణం విడిచాడు. అది అక్షరాల శక్తి. అది శబ్దశరం వాడి. అది వాల్మీకి పలుకు ములుకు.

ఈ శ్లోకానికి రెండు అర్థాలున్నాయి. ఒకటి బాహ్యార్థం. రెండవది అంతరార్థం. "కామాసక్తులైవున్న క్రౌంచపక్షుల జంటను వేరుచేసిన ఓ బోయవాడా! నీకు ఆయువు మూడింది" అని బాహ్యార్థం. వాల్మీకి పెట్టిన ఈ అక్షరాల శాపానికి బోయవాడు మరణించాడు. ఇక రెండవది రహస్యార్థం.

"కామమోహితుడై స్వైర విహారం చేసిన ఒక అధముణ్ని (రావణాసురుడు) వధించావు కనుక శ్రీ మన్నారాయణ స్వరూపుడవైన శ్రీరామచంద్రా! నీకు యశస్సు లభించగలదు." ఇది రామాయణార్థం.

ఈ రకంగా ఆదికవి పల్కిన శ్లోకంలో రెండు అర్థాల్ని యిమిడ్చాడు. ఒక అర్థం బోయవాడికి శాపం. రెండవ అర్థం శ్రీరామునికి ప్రశంసాపూర్వకమైన వరం.

ఆయన కవితార్ద్రహృదయంతో ఈ మాటలు పలికి ముందడుగు వేయబోయాడు. అంతలో అక్కడ నిరంతర హరినామ సంకీర్తనా లోలుడు నారదర్షి ప్రత్యక్షం అయ్యాడు. వాల్మీకి దేవర్షి వందనం చేశాడు. అప్పుడు నారదుడు యిలా అన్నాడు :

"మహర్షీ! శోక సంతప్త హృదయుడవై నువ్వు పలికిన శ్లోకం ఒక మహా సాహితీ యజ్ఞానికి నాంది పలికింది. నాలుగు పాదాలుగల శ్లోకం చెప్పి యీ యజ్ఞ కర్తవయ్యావు నువ్వు. అంటే ఆది కవివి నువ్వే. ఇక జాగుచేయక రామకథను వ్రాయి. అది త్రిలోక పూజితం అవుతుంది. త్రిలోకారాధ్య మవుతుంది. మానవ లోకంలో పలుకు ఉన్నంతకాలం అది ఆదికావ్యమై విరాజిల్లుతుంది. రాముడు రూపు దిద్దుకొన్న ధర్మమూర్తి. సదాచార సంపన్నుడు అగ్రహానుగ్రహ దక్షుడు. మహా పరాక్రమశాలి. సత్యవదనశీలి. ఏకపత్నీవ్రత నియమ నిష్ఠాగరిష్ఠుడు. మాట తప్పని

స్థిత ప్రజ్ఞుడు. రావణాది దుష్ట రాక్షసుల్ని వధించి లోకానికి సుఖ, శాంతులు ప్రసాదించిన అవతారమూర్తి. అటువంటి మహనీయుని దివ్యచరిత్ర వ్రాసి అక్షరతపస్వివి కమ్ము."



వాల్మీకికి నారదుని హితవు

నారదుని మాటలకు వాల్మీకి ముందు సంకోచించాడు. తనకంత సామర్థ్యం ఉన్నదా అని అనుమానించాడు. రామకథను మననం చేసుకొంటూనే ఆశ్రమం చేరాడు. భరద్వాజునితో మాటలాడాడు.

ఇంతలో అక్కడ బ్రహ్మ ప్రత్యక్షం అయ్యాడు. వాల్మీకి చతుర్ముఖునకు

వందన మాచరించాడు. తన అశక్తతను వెల్లడించబోయాడు. అప్పుడు బ్రహ్మ వాల్మీకిని వారించి యిలా అన్నాడు.

మహర్షీ! అంతర్ముఖుడవై యిన్నాళ్ళు చేసిన తపస్సు అంతా ఒక ఎత్తు ఇక నువ్వు వ్రాయబోయే రామాయణం అంతా ఒక ఎత్తు. ఆ కావ్య రచనతో నువ్వు అక్షర యశస్సును ఆర్జిస్తావు. సందేహించకు. నారదుడు చెప్పినట్లు రామ కథను నువ్వు కావ్యంగా వ్రాయగల సమర్థుడివి. ఈ కావ్య రచనతో నువ్వు దేవ, పితృ సమాజ ఋణాలు తీర్చుకొన్నవాడవవుతావు. ఎలాగంటే రాముడు దేవతా మూర్తి. ఆయన కథ రాయడం దేవఋణ విముక్తికి మార్గం. కావ్యరచనతో నువ్వు ఆర్జించే కీర్తివల్ల పితృఋణం తీరుతుంది. సందేహించక రామకథను వ్రాయి."

బ్రహ్మ యిలా వాల్మీకికి హితవుచెప్పి, ఆయనచే కావ్యరచనకు అంగీక రింపజేసి మాయమయ్యాడు.

తరువాత వాల్మీకి ప్రతిరోజు శ్లోకాలుచెప్పగా, భరద్వాజుడు వ్రాశాడు. అదే రామాయణం అయింది. వాల్మీకి కవికోకిల అయ్యాడు. ఇక రామకథ చెప్పుకొందాం.

## బాలకాండ

ఉత్తరం యత్సముద్రస్య
హిమాద్రేశ్చైవ దక్షిణమ్!
వర్షంతం భారతం నామ
భారతీ యత్ర సంతతిః ॥

సముద్రానికి ఉత్తర దిక్కు, హిమాలయ పర్వతాలకు దక్షిణ దిక్కు ఎల్లలుగా ఉన్న దేశం భారతదేశం. ఇక్కడి ప్రజలను భారతీయులు అంటారు. ప్రకాశవంతమైన, దివ్యమైన ఆలోచనల యందు నిమగ్నమై ఉంటారు. కనక యీ ప్రజల్ని భారతీయులు అన్నారు

అటువంటి భారతీయులకు రాజులై, దేశానికి ఖండ ఖండాంతరాలలో

పేరు ప్రతిష్ఠలు తెచ్చినవారు సూర్యవంశరాజులు. ఈ వంశంలో మొదటివాడు వైవస్వత మనువు. అతడు స్మృతిని వ్రాసి, మానవజాతికి సామాజిక, ఆర్థిక, రాజకీయపరమైన కట్టుదిట్టాలు చేశాడు. మనుస్మృతి ఆనాటి రాజ్యాంగం అని స్థూలంగా చెప్పవచ్చు.

అనంతకాలంలో ఎందరో సూర్యవంశ రాజులు మనదేశాన్ని పాలించారు. హరిశ్చంద్రుడు, దిలీపుడు, రఘు మహారాజు ఈ వంశస్థులే రఘు మహారాజు పేరున ఈ వంశం "రఘువంశం" అని పేరు గాంచింది.

అటువంటి దివ్య చరిత్రగల రఘువంశ చక్రవర్తులలో దశరథుడు అనే పేరు సార్థకం అయింది.


సరయూనదీ తీరానగల అయోధ్య రాజధానిగా ఆయన పరిపాలన సాగిస్తున్నాడు. ఆయనకు ముగ్గురు భార్యలు. వారి పేర్లు కౌసల్య, సుమిత్ర, కైక. ఆయన హితాన్నికోరి సకలశాస్త్ర మర్యాదలు తెలిసిన పురోహితులు ముగ్గురు ఉండేవారు. వారి పేరు వశిష్ఠుడు, వామదేవుడు జాబాలి. వీరిలో వశిష్ఠుడు రఘు వంశానికి కుల గురువు. ధర్మా ధర్మ నిర్ణయం చేయగల న్యాయశాస్త్రవేత్త వామదేవుడు. జాబాలికూడా అంతటివారే. వీరి ముగ్గురి సూచనలు హితవచనాలు దశరథునకు రాజ్య కార్యనిర్వహణలో ఎంతగానో ఉపకరిస్తున్నాయి.

అయోధ్యా రాజ్యానికి ఎనిమిదిమంది మంత్రులు. వారిలో సుమంత్రుడు పేరెన్నిగన్నవాడు. వారందరూ రాజనీతి కోవిదులే. రాజ్య సంరక్షణలో చతురోపాయాలు ప్రయోగించగల నిపుణులే.

రాజ్యానికి యెటువంటి సమస్యలు లేవు. ప్రజలు సకల విధ సిరిసంపదలతో తులతూగుతున్నారు. అకాల మరణాలు లేవు. అవినీతి లేదు. అధర్మనిర్ణయాలు లేవు. కరువు కాటకాలు లేవు. కార్తె, కార్తెకు వానలు పడేవి. ఎటువంటి వైపరీత్యాలు లేని సుభిక్ష పరిస్థితి నెలకొని ఉంది.

దశరథ మహారాజు అన్ని రాజభోగాలు విద్యుక్తంగా అనుభవించిన వాడు. పట్టమహిషి కౌసల్య రఘువంశరాజుల కీర్తికే మకుటాయమానంగా మెలిగేది

సుమిత్ర భర్తతోనూ, సవతులతోనూ పొరపొచ్చాలు లేక సరళ స్వభావంతో ఉండేది. కైకేయి కౌసల్యపట్ల, సుమిత్రపట్ల ఆదరభావంతో, భర్తపట్ల అనురాగ శీలంతో మసలేది. ఈ రకంగా దశరథ మహారాజుకు ఏ లోటూ లేదు. ఏ సమస్య



అశ్వమేధ యాగం

లేదు. సంవత్సరాలు గడిచిపోయాయి. వయసు మళ్ళింది. వృద్ధాప్యం శరీరాన్ని శిథిలం చేస్తున్నది.

నానాటికీ దశరథునిలో విచారం పెరగసాగింది. అదే-సంతానంలేదన్న

బాధ. రఘువంశం అంతరించిపోతుందన్న వేదన-చివరకు ఒకనాడు మంత్రి, పురోహితులతో సంప్రదించాడు. అశ్వమేధయాగం చేయాలని నిర్ణయించారు.

అందుకు తగిన ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. శుభలక్షణాలు గల గుర్రాన్ని వదిలారు. దానివెంట సైన్యం వెళ్ళింది. సంవత్సరకాలం అది దేశదేశాలు తిరిగి అయోధ్య చేరింది. ఇక యాగం ప్రారంభం కావాలి. ఆ ఏర్పాట్లు జరుగుతున్నాయి.

## వైకుంఠంలో

మానవలోకపు కాలమానం ప్రకారం అది ఇరవైనాలుగవ మహాయుగ పరిభ్రమణ కాలంలో త్రేతా, ద్వాపరయుగ సంధికాలం ఆ కాలంలో రావణాసురుడు జన్మించి, లంకానగరం రాజ్యంగా చేసుకొని విజృంభించాడు. పరమ శివభక్తుడై ఆర్యులను హింసించసాగాడు. అతడి ఆగడాలకు సజ్జనులు ఘూర్ణిల్లారు. దేవతలు భయకంపితులయ్యారు. నవగ్రహాలు అతను చెప్పినట్లు వినే దశ దాపురించింది. అష్టదిక్పాలురు, నవనిధులు, కులపర్వతాలు, సప్తసముద్రాలు అతని చేతి ఆజ్ఞలకు శిరసు వంచి, సంచరించే స్థితికి దిగజారాయి. మదోన్మత్తుడైన రావణుని గర్వం అణచగలవాడే లేకపోయాడు.

అప్పుడు దేవతలు, బ్రహ్మను వెంటబెట్టుకుని వైకుంఠానికి వెళ్ళారు. శ్రీమన్నారాయణుడు శేషపాన్పుపై పరుండి యోగనిద్రలో ఉన్నాడు. మహాలక్ష్మి ఆయన పాదాలు ఒత్తుతున్నది. దేవతలు ఆ దివ్య మంగళస్వామిని ప్రార్థించి ఇలా అన్నారు.

“మహానుభావా! దేవతలకు, సత్పురుషులకు విపత్తు కలిగినప్పుడల్లా అవతరించి దుష్టుల్ని శిక్షిస్తానన్నావు. కల్పాంతరాలలో మత్స్యావతారం ఎత్తావు. సోమకాసురుణ్ణి సంహరించి, వేదాల్ని తెచ్చి బ్రహ్మకు యిచ్చావు. క్షీరసాగర మథనవేళ మంథర పర్వతం మునిగిపోకుండా కూర్మావతారం యెత్తి దానిని పైకెత్తి అమృతసాధనకు సహకరించావు. వరహావతారం యెత్తి హిరణ్యాక్షుణ్ని

సంహరించి భూదేవిని ఉద్ధరించావు. వామనమూర్తివై ప్రభవించి బలిని పాతాళానికి త్రొక్కి దేవతలను కాపాడావు. పరశురాముడివై పుట్టి బల గర్వితులైన రాజుల గర్వం అణిచావు. ఇప్పుడు రావణునివల్ల బాధలు పడుతున్న మమ్మ కాపాడు."

దేవతల మొరవిని శ్రీహరి యేమీ మాట్లాడలేదు. కాని బ్రహ్మ వైపు సాభిప్రాయంగా చూశాడు. అప్పుడు బ్రహ్మ దేవతలతో యిలా అన్నాడు :

"దేవతలారా! శ్రీహరి మనపై కరుణించాడు. ఆయన మానవ అవతారం యెత్తనున్నాడు. దీనికి కారణం లేకపోలేదు. ఘోరమైన తపస్సుచేసిన రావణుడు దేవతలవల్ల తనకు ప్రాణాపాయం లేకుండా చేయమని కోరాడు తప్ప మానవులవల్ల అపాయం ఉంటుందని వూహించలేకపోయాడు. అందుచేత శ్రీ మహావిష్ణువు భూలోకంలో రామావతారం యెత్తి రాక్షస సంహారం చేయాలని సంకల్పించాడు. మీరందరూ మీ మీ అంశలతో మానవులుగా జన్మించండి నేను నా అంశతో జాంబవంతునిగా అవతరిస్తాను.

బ్రహ్మ మాటలు విని దేవతలు సంతోషించారు. తమ కష్టాలు గట్టెక్కే సమయం రానున్నదని తృప్తిపడ్డారు. వాయువు అంశచే అంజనీ దేవియందు ఆంజనేయుడు జన్మించాడు. సూర్యుడి అంశచే సుగ్రీవుడు, ఇంద్రుని అంశతో వాలి, దేవశిల్పి మయుని అంశతో నలుడు జన్మించారు.

ఇలా భూలోకంలో దేవవిభూతి మనరూపంలో సంచరిస్తున్నది. మహావిష్ణువు అంతరించే శుభఘడియకై అందరూ నిరీక్షిస్తున్నారు. ఆ సమయం రానే వచ్చింది. అదే దశరథుని పుత్రకామేష్టి ముహూర్తం.

## పాయస కలశం

అశ్వమేధయాగం నిర్విఘ్నంగా సాగుతోంది. ఇక దీక్ష ముగిసేకాలం సమీపించింది. అప్పుడు సుమంత్రుడు దశరథ మహారాజుతో ఒకనాడు రహస్యంగా యిలా అన్నాడు.

"మహారాజా! పుత్రార్థియైనవాడు పుత్రకామేష్టి చేయాలని శాస్త్రవిదులంటు

న్నారు. అశ్వమేధంతో పాటు ఆ యజ్ఞాన్ని కూడా నిర్వర్తించండి. మీ కుమార్తె శాంతాదేవి భర్త ఋష్యశృంగులవారు ఆ యాగవిధి కూలంకషంగా తెలిసినవారు. ఆమెను మీరు మీ స్నేహితులు రోమపాదరాజునకు దత్తత యిచ్చినారు. ఇప్పుడు



ఋష్యశృంగులవారు ఆ రాజ్యంలోనే ఉన్నారు. ఆయన అడుగుపెట్టడంతోనే అక్కడ వర్షాలుపడి, కరువు తీరిందని విన్నాంకద.

అంతటి దివ్యశక్తి సంపన్నులైన ఆ మహర్షిని ఆహ్వానించి యీ పుత్ర కామేష్టిని నిర్వర్తిద్దాము.

దూరదృష్టితో సుమంత్రుడు చేసిన సూచనను దశరథ మహారాజు ఆమోదించాడు. వెంటనే లేఖ వ్రాయించి రోమపాద మహారాజుకు పంపారు. త్రికాలవేత్త అయిన రుష్యశృంగుడు రామావతారానికి తన వంతు కర్తవ్యాన్ని పూర్తిచేయాలని సంకల్పించి, శాంతాదేవితో సహా అయోధ్యకు వచ్చాడు.

దశరథుడు దివ్యజ్ఞాన సంపన్నుడైన రుష్యశృంగునికి గౌరవాదర పురస్సరంగా స్వాగత, సత్కారాలు చేశాడు.

ఆ వేదవిందుని సూచనా, సలహాలను అనుసరించి పుత్రకామేష్టికి ఏర్పాట్లు పూర్తి అయ్యాయి. దశరథుడు కర్త అయ్యాడు. రుష్యశృంగుడు అధ్వర్యుడు అయ్యాడు. వశిష్ఠుడు బ్రహ్మస్థానం అలంకరించాడు. ఉదాత్త, అనుదాత్త స్వర విశారదులయిన వేదవేత్తలు ఉద్గాతలయ్యారు. వారు ఉచ్చైస్వరంలో "రుక్"లు గానం చేసి వోజోదాత్తలైన దేవతల్ని ఆహ్వానం చేస్తున్నారు. దశరథుడు, కౌసల్య, సుమిత్ర, కైకేయిలతో శ్రద్ధాభక్తులతో యజ్ఞం నిర్వర్తిస్తున్నాడు.

యజ్ఞం ఆఖరు రోజున యజ్ఞ పురుషుడు అగ్నిగుండం నుంచి అవతరించాడు. అతని చేతులలో బంగారు కలశం ఉంది. ఆ యజ్ఞపురుషుని చూచి అందరూ ఆనంద పరవశులయ్యారు. దశరథుని సంతోషానికి మేరలేదు. రుష్యశృంగుని కనులలో యజ్ఞనిర్వహణ సాఫల్యదీప్తి వెలుగుతోంది.

యజ్ఞపురుషుడు అందరినీ ఆశీర్వదించి, చేతిలోని బంగారుపాత్రను దశరథునకు అందించి, సంజ్ఞలు చేసి మాయమైనాడు. తరువాత దశరథుడు ఆ పాత్ర లోని పాయసాన్ని కౌసల్యకు, కైకేయికి యిచ్చాడు. వారిద్దరు చెరిసగం పరమాన్నాన్ని సుమిత్రకు పెట్టారు.

ఆ దివ్య ప్రసాదాన్ని ముగ్గురు రాణులు భక్తి ప్రపత్తులతో సేవించారు. దశరథుడు యాగపరిసమాప్తి చేసి రుత్విజులకు యథోచితరీతిలో దక్షిణలు సమర్పించి అందరికీ వీడ్కోలు యిచ్చాడు.

పరమాన్నం సేవించిన కొద్దికాలానికే కౌసల్య, సుమిత్ర, కైకేయి గర్భవతులయ్యారు, వారి ఆనందానికి అంతులేదు. దశరథుని తృప్తికి సీమలు లేవు. వశిష్ఠునిలో దివ్యానందం వెల్లివిరిసింది.

దశరథ మహారాజునకు సంతు కలుగుతుందని అయోధ్యానగరమే పులకించినది.

రాణులకు ఆయా మాసాలలో చేయవలసిన ఉపచారాలను, దోహద క్రియలను చేయించాడు దశరథుడు. వారు స్వాదు, మధుర, దివ్యగుణ రసభరితాలైన ఆహారం స్వీకరించి, గర్భస్థ శిశువుల పరిపూర్ణ వికాసానికి తగు జాగ్రత్తలు వహించారు.

## నలుగురు చంద్రులు

కాలచక్రం పరిభ్రమించింది. వసంతకాలం వచ్చింది. అది చైత్రమాసం. శుక్లపక్షం, నవమితిథి, పునర్వసు నక్షత్రం, భూలోకంలోని నదీనదాలు ప్రశాంత ప్రవాహంతో ప్రవహిస్తున్నాయి. తూర్పుగాలులు, పడమటి గాలులుకూడా యెటువంటి ప్రభావాలు లేకుండా ప్రసరిస్తున్నాయి. కులపర్వతాలు వింత కాంతిని వెదజల్లుతున్నాయి. ఎనిమిది దిక్కులలోనూ దివ్యతేజస్సు వెలుగొందుతోంది. సాధు పురుషుల హృదయాలు శుభోదర్కఘడియను సూచిస్తున్నట్లున్నాయి. వారి మనస్సులలో యెటువంటి వైకల్యం లేదు.

అటువంటి శుభసమయాన కౌసల్యాదేవికి సుఖప్రసవం అయింది. ఆకాశం నుంచి చంద్రుడే దిగి వచ్చాడా అన్నట్లు నీలిమేఘచ్ఛాయతో నిగనిగ లాడుతున్న శిశువు జన్మించాడు. కైకేయికి కూడా అదే రూపురేఖలు గల శిశువు జన్మించాడు. సుమిత్రకు కవలలు జన్మించారు.

అయోధ్యానగరంలో నలుగురు చంద్రులు ఉదయించిన ఆనందం వెల్లివిరిసింది. దశరథుని ఆనందానికి కొలమానం లేదు, కౌసల్య, సుమిత్ర కైకేయుల ముఖాలలో మాతృత్వం పొందామన్న తృప్తి కొట్టవచ్చినట్లు కనిపిస్తోంది.


వశిష్ఠమహర్షి ఆ పిల్లలకు జాతకకర్మలు చేయించాడు. నగరంలోనే కాదు. మొత్తం సామ్రాజ్యంలోనే పుత్రోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. రఘువంశ దీపకులైన నలుగురుపిల్లలు దశరథునకు కలిగారనివిన్న ప్రతివాడు ఆనందించారు. అయితే దుష్టుల, ద్రోహుల హృదయాలు మాత్రం కంపించాయి. రోషకషాయితా లయ్యాయి.



రఘువంశ చంద్రులు

ఒక శుభముహూర్తాన దశరథుడు తన పిల్లలకు పేర్లు పెట్టించాడు. వశిష్ఠ మహర్షి ఆ శిశువులు జన్మించిన లగ్నాలను వారి లక్షణాలను దివ్యదృష్టితో అర్థం చేసుకొని వారికి నామకరణం చేశాడు.

కౌసల్య కుమారునకు రాముడు అని పేరు పెట్టాడు. అందరినీ ఆనందింప జేసే విశిష్ట లక్షణం వున్నవాడు, యోగులు నిరంతరం తమ హృదయాలలో ధ్యానించేవాడు అయిన విశిష్ట లక్షణం కలవాడు కనుక ఆ పేరు పెట్టాడు. కైకేయి కుమారునకు భరతుడు అని పేరుంచాడు. ఉజ్జ్వలమైన ఆదర్శాలను అనుష్ఠించేవాడు



వశిష్ఠుడి దగ్గర విద్యాభ్యాసం

కనుక ఆ పేరుంచాడు. సుమిత్రా పుత్రులకు లక్ష్మణుడు శత్రుఘ్నుడు అని నామకరణం చేయించాడు. సకల శుభలక్షణ సమన్వితుడు కనుక అతనికి

లక్ష్మణుడు అని, శత్రువులను నాశనం చేయగలవాడు కనుక శత్రుఘ్నుడు అని పేర్లు పెట్టించాడు.

తల్లి దండ్రులకు కనుల పండువగా ప్రజలకు హృదయరంజకంగా బాలకులు నలుగురు పెరిగి పెద్దవారవుతున్నారు. రాముడు, లక్ష్మణుడు ఒక జట్టుగా ఉండేవారు. భరత శత్రుఘ్నులు కడుమైత్రితో మెలగేవారు. ఎక్కడకు వెళ్ళిన ఏం చేసినా కలిసే వెళ్ళేవారు. కలిసే చేసేవారు. అన్నదమ్ముల అనుబంధానికి, అనురాగానికి, ఆత్మీయులకు ప్రజలు వీరి పేర్లు చెప్పేవాడు.

దశరథుడు వారికి ఉపనయనాదికాలు చేయించి, విద్యాభ్యాసానికి ఏర్పాట్లు చేశాడు. వశిష్ఠులవారి ఆచార్యత్వంలో నలుగురు బాలురు వేదవేదాంగ లు, ధర్మ శాస్త్ర రహస్యాలు అభ్యసించారు. రాజనీతిని తెలుసుకున్నారు. యుద్ధ విద్యలలో ఆరితేరుతున్నారు. బాలకులలో సహజంగా క్షాత్రతేజం, విద్యాబుద్ధులతో బ్రహ్మ తేజం కొట్టవచ్చినట్లు కనిపించేవి. "భూలోకంలో అవతరించిన యే దివ్యశక్తి స్వరూపాలో వారు"—అనుకొనేవారు ప్రజలు.

రఘువంశ కులదీపకులైన బాలకుల బాల్యచేష్టలు, వారి చదువు సంధ్యలు ఆటపాటలు, ముద్దుమురిపాలతో రాజమందిరం కోలాహలంగా వుండేది. దశరథ మహారాజు పిల్లలతో, రాణులతో సరదాగా కాలం వెళ్ళబుచ్చుతున్నాడు.

ACC NO. 26018
294.592
RAN
25200

## బల, అతిబల...

అయోధ్యలో ఒకనాడు దశరథ మహారాజు నిండు కొలువై వున్నాడు. వశిష్ఠ, వామదేవాదులు ధర్మశాస్త్ర మీమాంస చేస్తున్నారు. వారి సంభాషణ చివరకు వేదాంతంలోనికి దిగింది. మరొకవైపు మంత్రులు రాచకార్యాల గురించి తర్జన భర్జనలు చేస్తున్నారు. పురోహిత, కార్తాంతికులు ఆ సంవత్సర ఫలాల గురించి, పాడి పంటలు తీరు గురించి, గ్రహాంగతులు గురించి లెక్కలు వేస్తున్నారు. దశరథుడు వారివారి వాద ప్రతివాదాలు వింటూ మధ్యమధ్య తన అభిప్రాయాలు చెపుతున్నాడు. సూచనలు చేస్తున్నాడు. సభంతా కోలాహలంగా వుంది.

ఆ సమయంలో ప్రతీహారి వచ్చి "విశ్వామిత్ర మహర్షి వచ్చారని" చెప్పి వెళ్ళాడు. దశరథుడు వెంటనే మంత్రి, పురోహితులను వెంట పెట్టుకుని విశ్వామిత్రు నకు ఎదురేగి, సకలవిధ రాచమర్యాదలతో స్వాగతం పలికాడు. సత్కారం చేశాడు. ఉచితమైన ఆసనంపై ఆ రాజర్షిని కూర్చుండబెట్టి వినయాంజలి ఘటించి "తమ ఆజ్ఞ! నే నేమి చేయగలవాడను"—అని అడిగాడు.

అప్పుడు విశ్వామిత్రుడు యిలా అన్నాడు.

"దశరథా! లోకక్షేమాన్ని ఆశించి నేను ఒక యాగం తలపెట్టాను. కాని ఆ యాగాన్ని రాక్షసాధములు భంగం చేస్తున్నారు. ఆ దుష్ట రాక్షసుల్ని చంపడానికి రామలక్ష్మణుల్ని పంపించు."

రాజర్షి మాటలకు దశరథుడు కంపించినాడు. నిండా పదారేళ్ళు నిండని ఆ పసివారిని సకల మాయావిద్యా విశారదులయిన రాక్షసులను చంపడానికి యెలా పంపగలను? లేక లేక కలిగిన యీ సంతానాన్ని దుష్టరాక్షసులకు చేజేతులా ఎలా బలిపెట్టగలను? ఇలా బాధపడ్డ దశరథుడు యిలా అన్నాడు.

"విశ్వామిత్ర మహర్షీ! నా కంటిపాపలుగా చూసుకొంటున్న ఈ రఘువంశ దీపకులను పంపలేను. నేనే వచ్చి రాక్షసుల్ని సంహరిస్తాను. లేదా లక్షోప లక్షల సైన్యాన్ని పంపిస్తాను. నా అశక్తతను మన్నించండి."


దశరథుని మాటలతో విశ్వామిత్రుడు ఆగ్రహించాడు. "మహారాజా! ఋషులు అడిగినది యివ్వడం రఘువంశాచారం. ఆ కుల మర్యాదను పాటించలేని భీరువువైన నిన్ను అర్థించడం నాదే పొరపాటు. వస్తాను" అని విశ్వామిత్రుడు వెళ్ళబోయాడు.

అప్పుడు వశిష్ఠుడు విశ్వామిత్రుని శాంతింపజేసి, కూర్చుండబెట్టి దశరథునితో యిలా అన్నాడు.

"మహారాజా! రామచంద్రుడు సామాన్య బాలకుడు కాదు. చంద్రుడు, బృహస్పతి కలిసి కార్కాటకంలో వుండగా, ఐదుగ్రహాలు ఉచ్చస్థితిలో వుండగా జన్మించిన సూర్యవంశదీపకుడు. అతను దేవకార్య సిద్ధికై నీ గర్భవాసాన జన్మించిన

వాడు. అదీగాక విశ్వామిత్రుల కోరిక లోకరక్షణ. కనుక సంశయించక చిరంజీవులని పంపించు

కులగురువు వశిష్ఠుని మాటలు విని దశరథుడు, మనసు దిటవు చేసుకొని



విశ్వామిత్రుని ఆజ్ఞ

రాముణ్ని, లక్ష్మణుణ్ని విశ్వామిత్రుని వెంట పంపాడు. బాలురిరువురు తల్లిదండ్రులకు, వశిష్ఠ వామదేవాదులకు పాదాభివందనం చేసి విశ్వామిత్రుని వెంట వెళ్ళారు. నగరం పొలిమేరలవరకు వారిని దశరథాదులు సాగనంపి వీడ్కోలు యిచ్చారు.

అక్కడినుంచి విశ్వామిత్రుడు ముందు నడువగా వెనక రాముడు, లక్ష్మణుడు అనుసరించారు. రాళ్ళనక, రప్పలనక ముళ్ళనక వారు నడిచి వెళుతున్నారు. జనపదాలు దాటారు. కొండపల్లెలు నడిచారు. ఇసుక బాటలవెంట అడుగులు వేశారు. రాలబాటలమీద అంగలు వేశారు. అరణ్యమార్గంలో ప్రవేశించారు.

పాలరాతి భవనాలలో, సుతిమెత్తని తివాచీలపై నడవవలసిన ఆ రాజకుమారులు ముళ్ళు గుచ్చుకొన్నా, రాళ్ళు తగిలి రక్తం స్రవించినా లెక్కచేయక విశ్వామిత్రుని వెంట నడుస్తున్నారు వారిలో కర్తవ్యదీక్ష కనిపిస్తోంది.

అలా నడిచి, నడిచి వారు ఒకరాత్రి ఒక నదీతీరాన ఒక ఆశ్రమం చేరారు. అక్కడ విశ్రమించారు. సూర్యోదయానికి ముందు విశ్వామిత్రుడు లేచి, రామలక్ష్మణుల్ని లేపాడు. వారు కాలకృత్యాలు తీర్చుకొన్నారు. ఆశ్రమవాసులు పెట్టిన ఫలాలు తిన్నారు. పుట్టతేనె త్రాగారు. విశ్వామిత్రునికి ఎదురుగా కూర్చున్నారు. అప్పుడు విశ్వామిత్రుడు వారితో యిలా అన్నాడు.

"చిరంజీవులారా! ఇంకొంచెం దూరం ప్రయాణిస్తే నా ఆశ్రమం వస్తుంది. అయితే ప్రయాణం దుర్గమమైన అరణ్య మధ్యంలో జరుగుతుంది. అంతేకాక ఇకపై మీరు నిర్వర్తించవలసిన పనులు కష్టమైనవి. ఆహారం నిద్రాదులకు అవకాశం వుండదు. కనక మీకు "బల — అతి బల" అనే విద్యలు వుపదేశిస్తాను వీటి వల్ల మీకు ఆకలిదప్పులు వుండవు. శ్రమవుండదు, శరీరం శుష్కించదు."

ఈ మాటలు చెప్పి విశ్వామిత్రుడు వారిరువురికి ఆవిద్యలు వుపదేశించాడు. అక్కడనుంచి ముగ్గురు ప్రయాణమైనారు.

## స్త్రీపై బాణమా ?

విశ్వామిత్రుడు ముందు నడవగా రాముడు లక్ష్మణుడు ఆయన వెంట అడుగులు వేస్తున్నారు. ఆ మహారణ్యంలో ఆయా ప్రదేశాల వివరాలు, వాటి పుట్టుపూర్వోత్తరాలు వివరిస్తూ — విశ్వామిత్రుడు నడుస్తున్నాడు. రామలక్ష్మణులు ఆ దివ్యకథలు వింటూ అనుసరిస్తున్నారు.

ఒకనాటి రాత్రి మరొక ఆశ్రమంలో విడిది చేశారు. మరునాటి ఉదయం లేచి కాలకృత్యాలు తీర్చుకొన్నారు. సంధ్యావందనం ముగించుకొని వచ్చిన విశ్వామిత్రుడు ఆ బాలకులకు తనకు తెలిసిన దివ్యాస్త్రాల ప్రయోగ ఉపసంహారాలు బోధించాడు.

మరల ప్రయాణం సాగించారు. ఇక కొద్దిదూరం నడిస్తే విశ్వామిత్రుని ఆశ్రమం వస్తుంది ఈ లోగానే వారిని భయకంపితులను చేస్తూ రాక్షసి అరుపులు, పెడబొబ్బలు వినిపించాయి. రామలక్ష్మణులు చుట్టూ చూశారు. వారికేమీ కనిపించ లేదు. అప్పుడు విశ్వామిత్రుడు యిలా అన్నాడు.

"రామా! అది తాటకి అనే రాక్షసి చేస్తున్న అట్టహాసం. అది మహా మాయావి. దానిని సంహరించు."


అప్పుడు రాముడు, "స్త్రీపై బాణం ప్రయోగించడమా ?" అని సందేహించాడు.

దానిపై విశ్వామిత్రుడు "నాయనా! యజ్ఞసంరక్షణార్థం, సాధుపురుషుల సంక్షేమార్థం ఆమెను నువ్వు వధించు, సందేహించకు" అని ధర్మసూక్ష్మాన్ని బోధించాడు.

విశ్వామిత్రుని మాటలు విని రాముడు బాణం సంధించాడు. తాటకి అట్టహాసం చేస్తున్నవైపు గురిచూసి వదిలాడు.


మరుక్షణంలో ఆ బాణం రివ్వున వెళ్ళి తాటకి గుండెల్ని ఛేదించింది. ఆ రాక్షసి భయంకరంగా విలపిస్తూ నేలకూలింది. ప్రాణాలు వదిలింది. విశ్వామిత్రుడు రాముని తల నిమిరి ఆశీర్వదించాడు.

తర్వాత వారు ఆశ్రమం చేరారు. యాగం ప్రారంభం అయింది. ఇంతలో ఆకాశంనుంచి రక్తం, మాంస ఖండాలు, ఎముకల పోగులు వర్షించసాగాయి. అప్పుడు విశ్వామిత్రుడు "రామ లక్ష్మణులారా! ఇది రాక్షసుల పని. తాటకి కొడుకు సుబాహుడు, వాడి ‌ వ మారీచుడు ఈ దౌష్ట్యానికి పాల్పడ్డారు. వారిని సంహరించండి" అని ఆజ్ఞాపించాడు.




తాటకి వధ

అప్పుడు రామ లక్ష్మణులు బాణాలు వదిలారు. సుబాహుడు మరణించాడు. మారీచుడు మాత్రం బాణం దెబ్బకు నెట్టివేయబడి దొర్లి దొర్లి దక్షిణ సముద్రంలో దాగొన్నాడు.



యాగ సంరక్షణ

యజ్ఞకుండంపై బాణాలతో గొడుగు నిర్మించారు రామ లక్ష్మణులు. విశ్వామిత్రుని పర్యవేక్షణలో రామలక్ష్మణుల రక్షణలో యజ్ఞం ఎటువంటి ఆటంకాలు లేకుండా ముగిసింది. అందరూ అవభృథ స్నానాలు చేశారు.



శివ ధనుర్భంగం

రామలక్ష్మణులు మునిని వెన్నంటి నడిచారు. ముగ్గురు అరణ్యా వీధులు దాటి, జనపదాలలో సంచరించి, మిథిలానగరం చేరారు.

## విరిగిన విల్లు

మిథిలలో జనకమహారాజు విశ్వామిత్రునకు స్వాగత, సత్కారాలు చేశాడు విడిది యేర్పాటు చేశాడు.

మరునాడు స్వయంవరం ఏర్పాటయింది. దేశదేశాల రాకుమారులు బారులుతీరి బంగారు గద్దెలపై కూర్చున్నారు. వారందరి యెదుట యెత్తయిన వేదికపై శివధనుస్సు యెక్కుపెట్టిన ధీరుని జానకీబాల పరిణయమాడుతుంది.” అని జనకమహారాజు ప్రకటించాడు.

తర్వాత ఎందరో రాజకుమారులు తమ భుజబలాన్ని ప్రదర్శించి— శివధనుస్సును యెక్కుపెట్టాలని ప్రయత్నించారు. కాని వారి బలం చాలలేదు. ధనస్సును వారు యెత్తలేకపోయారు. ఓడిపోయి కూర్చున్నారు.

చివరకు విశ్వామిత్రుని అనుమతి తీసుకొని రాముడు శివధనుస్సును యెత్తాడు. నారిని వింటి కొమ్మకు తగిలించబోయాడు. పురాతనమయిన ఆ విల్లు వంగక విరిగిపోయింది. శివధనుర్భంగంలో జానకీదేవి హృదయం ఝల్లుమంది. దేవతలు పుష్పవర్షం కురిపించారు ఆమె వచ్చి రాముని మెడలో హారం వేసింది.

## సీతాకళ్యాణం

జనకమహారాజు తన పురోహితుడయిన శతానందుని హితవు ప్రకారం శుభలేఖ వ్రాయించి, దూతచేత అయోధ్యా నగరానికి పంపాడు. దశరథుడు ఆ లేఖ చదివి ఆనందపరవశుడయ్యాడు. వశిష్ఠాది పురోహితులు, కౌసల్యా,సుమిత్ర. కైకేయాది రాణివాసంతో, భరత శత్రుఘ్నులను వెంటబెట్టుకొని దశరథుడు మిథిలానగరానికి తరలివచ్చారు.

మగపెళ్ళివారికి జనకమహారాజు ఎదురు సన్నాహం చేశాడు. విడిదిలో ప్రవేశపెట్టాడు. తరువాత వశిష్ఠ, శతానందుల సలహాను అనుసరించి నలుగురికి వివాహాలు చేయసంకల్పించారు-

రామునకు సీతను, లక్ష్మణునకు ఊర్మిళను, భరతునికి మాండవిని



సీతా కళ్యాణం

శత్రుఘ్నునకు శ్రుతకీర్తిని యిచ్చి పెళ్ళి చేయాలని ఉభయవర్గాలవారు అంగీకరించారు. ఊర్మిళ, మాండవి, శ్రుతకీర్తి జనకుని తమ్ముని కుమార్తెలు.

పెళ్ళి యేర్పాట్లు పూర్తి అయ్యాయి. వధూవరులు పెండ్లిపీటలపై కూర్చున్నారు. జనకమహారాజు ఆయన దేవేరి సుమేధాదేవి సీతాదేవిని రామునకు పాణి

గ్రహణం చేశారు. సీతాదేవి చేతిని నీలికమలంవంటి రామునిచేతిలో వుంచి జనకుడు యిలా అన్నాడు :

"ఇయం మమసుతా సీతా
సహధర్మచరీ తవ !
ప్రతీచ్ఛ చైనాం భద్రంతే
పాణిం గృహీష్వ పాణినా ॥
పతివ్రతా మహా భాగా
ఛాయేవానుగతా సదా!
ఇత్యుక్త్వా ప్రాక్షి పద్రాజ్ఞ
మంత్రపూతం జలం తదా॥"

"శ్రీరామచంద్రా! ఈమె నా కుమార్తెసీత భూయజ్ఞం చేస్తూ నాగలితో దున్నుతుండగా యీమె బంగారు పేటికలో దొరికింది. అందుకే సీత అని పేరు పెట్టాను. (సీత అంటే నాగటి చాలు అని అర్థం) జనకరాజు పుత్రిగా పెరిగింది కనుక జానకి అయింది! మిథిలాపుర యువరాణి కనుక మైథిలి అన్నారు.


ఈమెను నీకు భార్యగా అర్పిస్తున్నాను. పతివ్రతా లక్షణాలు మూర్తీభవించిన ఈ బాల నిన్ను నీడవలె వెన్నంటి వుంటుంది. పాణిని గ్రహించు."

అని జనకుడు కన్యాదానం చేశాడు. దేవదుంధుభులు మ్రోగాయి. రాముడు సీతాదేవి మెడలో, లక్ష్మణుడు ఊర్మిళ కంఠాన, భరతుడు మాండవి గళాన, శత్రుఘ్నుడు శ్రుతకీర్తి మెడలో మంగళసూత్రాలు కట్టారు.

సీతాకళ్యాణ వేడుకలతో మిథిలానగరం ఆనంద పరవశమైంది.

## వైష్ణవ చాపం

పెళ్ళి వేడుకలు, వివాహ లాంఛనాలు పూర్తి అయ్యాయి. దశరథుడు తన పరివారాన్ని నూతన వధూవరులను వెంటబెట్టుకొని అయోధ్యకు బయలుదేరాడు. మిథిలానగరం పొలిమేర దాటేసరికి ఎదురుగా చేత గండ్రగొడ్డలి పెద్ద ధనుస్సు



పరశురామ గర్వభంగం

పట్టుకొని పరశురాముడు వచ్చాడు. ఆయన కళ్ళు కోపంతో నిప్పులు రాలుస్తు న్నాయి. ముఖం ఆగ్రహంతో యెర్రబడింది.

పెళ్ళివారందరూ నిలిచిపోయారు. అందరిలో భయం తాండవిస్తోంది. వారిని చూసి పరశురాముడు యిలా అన్నాడు :

"ఇరవై ఒక్కమారులు ఈ భూమండలాన్ని చుట్టివచ్చి, దుష్టక్షత్రియు లను సంహరించిన పరశురాముడుండగా మరియొక రాముడా! ఎవడువాడు ప్రాణాలు కాపాడుకొనడానికై గాజులు తొడిగించుకొన్న దశరథుని కొడుకని విన్నాను:

పాతదై చివికిపోయిన శివధనుస్సును విరవడం ఘనత కాదు. ధైర్యం. భుజబలం వున్నవాడయితే ఈ వైష్ణవచాపాన్ని ఎక్కుపెట్టాలి."

పరశురాముని మాటలు విన్న రాముడు ముందుకువచ్చి చిరునవ్వు నవ్వి ఆ బాణం అందుకొన్నాడు. మరుక్షణంలో పరశురాముని దివ్యాస్త్ర తేజం, బ్రహ్మతేజం రాముడిలోనికి ప్రసరించాయి. పరశురామునికి జ్ఞానోదయం అయింది. రాముడు శ్రీమన్నారాయణావతారం అని గ్రహించిన పరశురాముడు తన అవతార ప్రయోజనం పూర్తి అయినదని నిర్ధారించుకొన్నాడు. రాముని స్తుతించి అడవులకు వెళ్ళిపోయాడు.


తరువాత అందరూ క్షేమంగా అయోధ్య చేరారు. అక్కడ దశరథ మహారాజు మహావైభవంగా విందులు చేయించాడు. పండిత సత్కారాలు చేయిం చాడు. నాలుగు వర్ణాలవారికి బట్టలు పెట్టించాడు.

నూతన వధూవరుల సందడితో అంతఃపురం కలకలలాడింది. అయోధ్య పరవశించింది. దశరథుడు తన అదృష్టానికి మురిసిపోయాడు.

# అయోధ్యాకాండ

కాలం గడిచింది. దశరథునకు వయస్సు పైనబడింది. రాచకార్యాలు శ్రద్ధాసక్తులతో నిర్వర్తించలేకపోతున్నాడు. అదీకాక రామునకు యువరాజు పట్టాభిషేకం చేయవలసిన వయసూ వచ్చింది.

ఒకనాడు మహారాజు, మంత్రి, పురోహితుల్ని సంప్రదించాడు. వశిష్ఠుని సలహా అడిగాడు. అందరూ "రామునికి యువరాజు పట్టాభిషేకం చేయడం సముచితం" అన్నారు. వశిష్ఠుడు ముహూర్తం నిశ్చయించాడు. అయితే



మందర దుర్బోధ

ఆ సమయంలో భరత శత్రుఘ్నులు రాచనగరులో లేరు. వారు మేనమామ యింటికి వెళ్ళారు.

అయోధ్యలో రాముని పట్టాభిషేక సంరంభం ప్రారంభం అయింది. అన్ని విధాలా యోగ్యుడు, సమర్థుడు అయిన రామునికి పట్టాభిషేకం అంటే

ప్రజలు యెంతో సంతోషించారు. కౌసల్యా మాత మందిరంలో అంతా ఉత్సవ సంరంభమే తాండవిస్తున్నది.

## చేదు మాటలు

కైకేయి మందిరంలో ఒంటరిగా వుంది. ఆ సమయంలో ఆమె అరణపు దాసి మంథర ఆదరాబాదరా వచ్చింది. మంథిర మాట అంటే కైకేయికి ప్రాణం. ఆమె హడావుడి చూసి కైకేయి కారణం అడిగింది. అప్పుడు మంథర యిలా అంది :

"వెర్రిదానా! రాజుగారి ముద్దుల భార్యనని యిన్నాళ్ళూ మురిసిపోయావు. ఇప్పుడు చూడు నీ పీకలమీదకు వచ్చింది. రాజు నీతో ఒక్కమాటైనా చెప్పకుండా, నీ కొడుకు భరతుడు రాజ్యంలో లేని సమయం చూసి రామునికి పట్టాభిషేకం చేస్తున్నాడు. ఇకపై ఆ కౌసల్యదే యిష్టారాజ్యం. నువ్వు, నిన్ను నమ్ముకున్న నాబోటివారు యిక వారి మోచేతి నీళ్ళుత్రాగి బ్రతుకు వెళ్ళబుచ్చవలసిందే చేసుకొన్న వారికి చేసుకొన్నంత మ దేవ అని.

కేకయ రాజకుమారివై, ఇన్నాళ్ళు దశరథమహారాజుగారి గారాల భార్యవై మన్ననలు పొందిన నువ్వు యికముందు దాసివలె జీవించవలసిన దుస్థితి దాపురించనున్నది. అదే నా విచారం."


మంథర మాటలసారం కైకేయి తలకు బాగా ఎక్కింది. ఆమె కోపగించింది. దశరథునిపై ఆగ్రహించింది, తన భరతునకు రాజ్యాధికారం కట్టబెట్టాలని నిశ్చయించుకొని యిలా అంది :

"మంథరా ! రామపట్టాభిషేకం జరగనివ్వను. భరతుడే భావి భారత చక్రవర్తి కావాలి. వుపాయం చెప్పు."

అప్పుడు మంథర యిలా దుర్బోధ చేసింది :

"అమ్మాయీ! పూర్వం ఒకప్పుడు మహారాజుగారు నీకు రెండు వరాలు యిచ్చారు. వాటిని యిప్పుడు కోరుకో ఒకటి భరతునికి పట్టాభిషేకం. రెండు రాముని వనవాసం. అడవులకు పోయిన రాముడు తిరిగి రాజ్యాధికారి కాకుండా పధ్నాలుగేళ్ళు వనవాసం షరతుపెట్టు.

మంథర మాటలు కైకేయిపై బాగా పని చేశాయి. స్త్రీ సహజమైన కార్పణ్యం, అసూయ ఆమెలో కలిగాయి. మంథర వెళ్ళిపోయింది కైకేయి వస్త్రాభరణాలు విసర్జించి నల్లటి చీర ధరించి శోకమందిరంలో ప్రవేశించింది.




కైకకు వరాలిచ్చిన దశరథుడు

కొంతసేపటికి దశరథుడు వచ్చాడు. కైకేయి కోపమందిరంలో వున్నదని తెలుసుకొన్నాడు. నేరుగా ఆమె దగ్గరకు వెళ్ళి రామపట్టాభిషేక శుభవార్త చెప్పాడు.

కైకేయి కసిరికొట్టింది. ఛీత్కరించింది ఆడనాగై బుసకొట్టింది. కైకేయి

ఆంతర్యం అంతుపట్టక దశరథుడు అవాక్ అయినాడు. సంగతి ఏమిటని అడిగాడు. అప్పుడు కైకేయి యిలా అంది.

"మహారాజా! ఒకసారి మీరు దేవతలతో యుద్ధం చేస్తున్నప్పుడు మీ రథ చక్రం సీల వూడిపోగా నేను నా వేలిని అడ్డుపెట్టి రథం పడిపోకుండా కాపాడాను.



రామ వనవాసం

అప్పుడు నాకు మీరు రెండు వరాలిస్తానన్నారు. వాటిని ఇప్పుడు కోరుకొంటున్నాను. ఒకటి భరతుణ్ణి రాజును చేయాలి. రెండు రాముణ్ని అడవులకు పంపాలి."

కైకేయి మాటలు విని దశరథుడు ఎంతో బాధపడ్డాడు. నచ్చజెప్పి చూశాడు. రాచమర్యాద వివరించాడు. రామునిపట్ల తనకుగల అవ్యాజమైన రాగాతిశయాన్ని ఏకరువు పెట్టాడు. కైకేయి వినలేదు. అసత్యదోషం అంటరాదని దశరథుడు మౌనంగా ఉండిపోయాడు. కైకేయి వరాలవల్ల రాముడు వనవాసానికి వెళ్ళక తప్పదన్న భావనకు ఆయన చలించిపోయాడు. స్పృహ కోల్పోయాడు.

అప్పుడు కైకేయి రామునికి కబురు పంపింది పట్టాభిషేకానికై తగిన రాచ దుస్తులు ధరించి, ఆభరణాలు అలంకరించుకొని, తిలకం దిద్దుకొంటున్న రాముడు పినతల్లి వర్తమానం అందుకొని వెంటనే ఆమె మందిరానికి వచ్చాడు. కైకేయి మాతకు నమస్కరించి నిలిచాడు.

అప్పుడు కైకేయి దృఢస్వరంతో రాముణ్ని యిలా ఆజ్ఞాయించింది.

"రామా! నువ్వు నారవస్త్రాలు ధరించి పధ్నాలుగేళ్ళు వనవాసం చేయాలని మీ తండ్రిగారి ఆజ్ఞ. నీ స్థానంలో భరతుడు రాజు కావాలని వారి ఆశ."

రాముడు మారుమాట పలకలేదు. స్పృహకోల్పోయివున్న తండ్రి పాదాలకు ప్రణమిల్లాడు. మరుక్షణంలో రాచదుస్తులు విసర్జించి, నారవస్త్రాలు ధరించాడు. సీతకూడ అతనివెంట వచ్చింది. సుమిత్రాదేవి ఆశీస్సులుపొంది లక్ష్మణుడు వనవాసానికి వస్తానన్నాడు.

ముగ్గురూ కౌసల్యాదేవికి, సుమిత్రామాతకు, కైకేయి దేవేరికి నమస్కరించి, అయోధ్యా పురప్రజల దగ్గర సెలవు తీసుకొని సుమంత్రుడు సిద్ధం చేసిన రథంపై యెక్కి అడవులదారి పట్టారు.

# గంగదాటారు

సీతా రామలక్ష్మణులు యెక్కిన రథాన్ని, సుమంతుడు వేగంగా నడిపాడు. సాయంత్రం అయేసరికి గంగానదీతీరం చేరారు. అక్కడ వారికి గుహుడు అనే నిషాదరాజు కలిశాడు. తన పడవలో గంగానదిని దాటిస్తానని చెప్పాడు. ఆ రాత్రి సుమంతుడు వారితో ఉన్నాడు.

సుమంతుడు దుఃఖభారంతో రాముని దగ్గర సెలవు తీసుకొని అయోధ్యవైపు రథాన్ని మరలించి వెళ్ళిపోయాడు.

గుహుడు రాముని పాదాలు కడిగి, మధురఫలాలు, పుట్టతేనెతో ఆతిథ్యం యిచ్చి, పడవ యెక్కించాడు. పడవ యెటువంటి ఒడిదుడుకులు లేకుండా సాగిపోయి, గంగానదికి ఆవలితీరం చేరింది. రామలక్ష్మణులు మర్రిపాలలో జుట్టును ముడిగా వేసుకొన్నారు. గుహుడు సెలవు తీసుకొని వెళ్ళిపోయాడు.

లక్ష్మణుడు ముందు దారి చూపగా మధ్య సీత, వెనుక రాముడు అరణ్యమార్గంద్వారా నడిచి ఒక ఆశ్రమం చేరారు. అది భరద్వాజ మహాముని ఆశ్రమం.

ఆ మహర్షి వారికి కందమూల ఫలాలతో విందు చేశాడు. ఆ రాత్రికి వారక్కడ విశ్రమించారు. భరద్వాజుడు వారికి ధర్మసూక్ష్మాలు ఉపదేశించాడు.

చిత్రకూటం వెళ్ళి పర్ణశాల వేసుకొని ఉండవలసినదిగా ఆయన వారికి సూచించాడు. ఆ ప్రకారం వారు చిత్రకూటం చేరారు. అక్కడ సమతల ప్రదేశంపై లక్ష్మణుడు చక్కటి పర్ణశాల నిర్మించాడు. తనకు వేరుగా పర్ణకుటీరం వేసుకొన్నాడు. అన్న, వదినలను శ్రద్ధాభక్తులతో సేవిస్తూ కాలం వెళ్ళబుచ్చుతున్నాడు. రాముడు ఆ పరిసరాలలోని మునులను కలుసుకొని, వారిని సేవిస్తూ కాలం గడుపుతున్నాడు. ముగ్గురూ వనదీక్షకు అలవాటు పడుతున్నారు.


# భరతుని నిరాహారదీక్ష

సీతారామలక్ష్మణులను విడిచి వచ్చిన సుమంతుడు దశరథమహారాజును కలుసుకొన్నాడు. ఆ ముగ్గురూ గంగానదిని దాటి, ఆవలి తీరానగల అడవిలోనికి వెళ్ళారని సుమంతుడు చెప్పగావిన్న దశరథుడు "హా! రామా! హా! రామా" అని శోకిస్తూ ప్రాణాలు వదిలాడు.

సుమంతుడు వెంటనే దూతను పంపి భరత, శత్రుఘ్నులను రావించాడు. రామపట్టాభిషేక సన్నాహాలతో కోలాహలంగా ఉండవలసిన అయోధ్య ఏదో కీడు మూడినట్లు శోకాతురమై ఉండడం భరతునకు ఆశ్చర్యం కలిగించింది. ఎవరినడిగినా అతనికి సమాధానం రాలేదు.

చివరకు తల్లి దగ్గరకు వచ్చాడు. ఆమె సంగతి వివరించింది.

తల్లి చేసిన మహాపరాధానికి భరతుడు కోపించాడు. ఆమెను నిందించాడు. తండ్రి మరణానికి విలపించాడు.



వశిష్టమహర్షి వచ్చి భరతుని ఓదార్చి, శాంతింపజేసి కర్తవ్యం ఉపదేశించాడు. అంతకాలం నూనె తొట్టెలో వుంచిన దశరథుని భౌతికకాయానికి రఘు వంశాచారం ప్రకారం భరతునిచే అంత్యక్రియలు జరిపించాడు. అయోధ్య అంతా శోకగంభీర వాతావరణం నెలకొంది. కౌసల్యాదేవి శోకానికి మితిలేదు. సుమిత్రామాత గంభీరంగానే శోకాన్ని దిగమ్రింగుకొని కాలం గడుపుతోంది. కైకేయి తాను చేసిన పనికి పశ్చాత్తాప పడుతోంది.

ఒకనాడు భరతుడు సుమంత్రాదులను వెంటబెట్టుకొని గంగానదిని దాటి చిత్రకూటంవద్దకు వచ్చాడు. అక్కడ రాముడు వారందరి కుశలం అడిగాడు. తమ్ముని ద్వారా తండ్రిగారి మరణవార్త విని కొంతసేపు విలపించాడు. పెద్ద కొడుకుగా తండ్రి అంత్యక్రియలు జరపలేదు. కనుక అందుకు ప్రత్యామ్నాయంగా పిండిబొమ్మ చేయించి ప్రేతకర్మ నిర్వర్తించాడు.

ఆపై భరతుడు అన్నగారికి నమస్కరించి యిలా అన్నాడు :

"అన్నయ్యా! మా అమ్మ రాజ్యలోభంతో విజ్ఞత మరిచి నిన్ను అడవికి పంపింది. అందుకు నేను బాధ్యుణ్ని కాను. నాకు యీ అధికారం అక్కర్లేదు. ఈ రాజ్యం నీది. తిరిగి అయోధ్యకువచ్చి రాజ్యాధికారం చేపట్టు."

"తండ్రి ఆనతి జవదాటనని" రాముడు సమాధానం చెప్పాడు. ఎవరెన్ని విధాలుగా కోరినప్పటికీ, నచ్చజెప్పినప్పటికీ రాముడు దిగిరాలేదు. అప్పుడు భరతుడు నిరాహారదీక్ష పూనాడు, దానిపై రాముడు యిలా అన్నాడు.


"భరతా! నీ ఆదర్శం వందనీయం. కాని రఘువంశస్థులు మాట జవదాట రాదు. కనుక పద్నాలుగేళ్ళు పూర్తి అయ్యేవరకు నేను వనవాసంనుంచి తిరిగిరాను. అయితే నువ్వు రాజ్యాధికారం వద్దంటున్నావు కనక నా స్థానంలో పాదుకలుంచి, నా ప్రతినిధిగా రాజ్యపాలన చెయ్యి."

అన్న మాటలకు భరతుడు అంగీకరించాడు. అయితే ఒక షరతు పెట్టాడు.

"రాముడు లేని అయోధ్యలో నేను కాలు మోపను. అందుచేత నంది

గ్రామంలో కుటీరం నిర్మించుకొని ఈ పథ్నాలుగేళ్ళు వుంటాను, రామపాదుకలకు పట్టాభిషేకం చేసి, రాజ్య ప్రతినిధిగా నందిగ్రామంనుంచే కార్యభారం వహిస్తాను."

ఆ ప్రకారం భరతుకు శ్రీరామపాదుకలను గ్రహించి పరివారం వెంటరాగా



పాదుకా పట్టాభిషేకం

నందిగ్రామం చేరాడు. అక్కడ పర్ణశాల నిర్మించి పాదుకలకు పట్టాభిషేకం చేసి, ప్రతినిధిగా పాలన చేయసాగాడు.

ఇక్కడ అరణ్యంలో రాముడు ఒకనాడు లక్ష్మణుడితో యిలా అన్నాడు : "లక్ష్మణా! మనం అయోధ్యకు దగ్గరలో వుండరాదు. ఇంకా ముందుకు

పోదాం. ఇక్కడ వుంటే అప్పుడప్పుడు అయోధ్యనుంచి ఎవరయినా వచ్చి మన వనవాసానికి భంగం కలిగించవచ్చు. కనుక చిత్రకూటం వదిలి దక్షిణ దిక్కుగా వెళదాం."

లక్ష్మణుడు, సీత ఆయనను అనుసరించారు. ఒకనాడు వారు అత్రి మహాముని ఆశ్రమం చేరారు. ఆయన భార్య అనసూయాదేవి. ఆ మునిదంపతులు సీతారామ లక్ష్మణులకు ఆతిథ్యం యిచ్చారు అనసూయాదేవి సీతకు పతివ్రతా ధర్మాలు ఉపదేశించింది.

తరువాత వారు ముగ్గురు అత్రి మహాముని చెప్పిన ప్రకారం నడిచివెళ్ళి దండకారణ్యం ప్రవేశించారు.

## అరణ్యకాండ

సీతారామలక్ష్మణులు పల్లేరు బాటలు నడిచారు. రాళ్ళు పరచిన నేలపై అడుగులు వేశారు. ముళ్ళడొంకదారులు సాగారు. దండకారణ్యంలో అడుగడుగునా మున్యాశ్రమాలున్నాయి. ఆ మునులు వీరిని చూచి సత్కారాలు చేసి రాక్షసుల వలన తమకు కలుగుతున్న బాధలు రాముడికి చెప్పారు. "రాక్షసుల్ని చంపి ముని కులాన్ని రక్షిస్తానని" రాముడు వారికి అభయం యిచ్చాడు.

ఒకనాడు వారికి అగస్త్య మహాముని ఆతిథ్యం యిచ్చాడు. దివ్యమయిన ధనుస్సును రామునికి బహూకరించి అగస్త్యుడు యిలా అన్నాడు.

"దాశరథీ! ఇక్కడకు సమీపంలో గోదావరి తీరాన పంచవటి ఉంది. అక్కడ ఆశ్రమం నిర్మించుకొని ఉండండి. ఇకపై రాక్షస బాధ ఎక్కువ. ఈ రాక్షసుల్ని సంహరించి ఆర్య సంస్కృతిని కాపాడు."

అగస్త్యునకు అభివాదం చేసి రాముడు ముందుకు సాగారు. వారు ముగ్గురు పంచవటి చేరుకున్నారు. అక్కడ ఆశ్రమం నిర్మించుకొన్నారు.

## శూర్పణఖ

ఒకనాడు అటుగా శూర్పణఖ వచ్చింది. రాముడి అందం చూసి మోహిం

చింది. రాముణ్ని వలలో వేసుకోవాలని ప్రయత్నించింది. అప్పుడు రాముడిలా అన్నాడు.

"ఓ శూర్పణఖా! నేను ఏకపత్నీవ్రతుడను. జానకిని మినహా యితర



శూర్పణఖకి పరాభవం

స్త్రీని కన్నెత్తి చూడను. మా తమ్ముడు లక్ష్మణుడు అదిగో అక్కడ వున్నాడు వాడిని వరించు."

రాముడు తిరస్కరించినా లక్ష్మణుడు చేరతీస్తాడన్న ఆశతో శూర్పణఖ అతడి దగ్గరకు వచ్చింది.

లక్ష్మణునికి సంగతి అర్థంకాక రాముని వైపు సాభిప్రాయంగా చూశాడు. రాముడు సంజ్ఞ చేశాడు. అప్పుడు లక్ష్మణుడు శూర్పణఖ ముక్కుచెవులు కోసి వేశాడు.

అది హాహాకారాలు చేస్తూ తన సోదరులయిన ఖరదూషణాదులకు పోయి తనకు జరిగిన అన్యాయం గురించి చెప్పి ఏడ్చింది.

## రాక్షస సంహారం

ఖరదూషణాదులు తమ చెల్లెలికి జరిగిన అవమానానికి కోపగించారు. పందల వేలసంఖ్యలోఉన్న రాక్షస సైన్యాన్ని సమీకరించారు. పంచవటి వద్దకు దాడికివచ్చారు. రామలక్ష్మణులపై రాక్షససేనలు విరుచుకుని పడ్డాయి.

రకరకాల మాయలు ప్రయోగించి, రామలక్ష్మణుల్ని సంహరించాలని ప్రయత్నించారు. కాని ఫలితం లేకపోయింది. రాముడు, లక్ష్మణుడు దివ్యాస్త్రాలు ప్రయోగించి ఖరదూషణాదులను సంహరించారు. వేలాదిమంది దానవ సైనికులను చంపారు.

ఈ సంగతి తెలుసుకున్న శూర్పణఖ రావణుని దగ్గర మొరపెట్టుకోనాలని లంకకు పరుగెత్తింది.


రాక్షసుల విజృంభణకు సీత భయపడింది. అయితే వారిని వధించినందుకు మహర్షులు రాముణ్ణి అభినందించారు. తమకు రక్షణ కల్పించినందుకు అతడిని యెంతగానో పొగిడారు.

ఇకపై రాక్షసులు యెటువంటి పన్నాగాలు పన్ని తమను హింసిస్తారో అని సీత భయపడసాగింది. రాముడు ఆమెకు ధైర్యం చెప్పాడు.

## బంగారు లేడి

లంకలో రావణుడు కొలువుదీరి ఉండగా శూర్పణఖ వికృతాకారంతో భోరున విలపిస్తూ సభలోకి వచ్చింది. రావణుడు సంగతి యేమిటని అడిగాడు. అప్పుడు శూర్పణఖ యిలా చెప్పింది.

“అన్నా! రావణా! ప్రమాదం ముంచుకువస్తోంది. పంచవటి దగ్గర ముగ్గురు మానవులు ఆశ్రమం నిర్మించుకొని ఉన్నారు ఇద్దరు పురుషులు. వారిలో నల్లని మేని వాని పేరు రాముడు. పసుపువన్నె వాని పేరు లక్ష్మణుడు. రాముడి భార్య పేరు సీత. ఆమె అపరంజి బొమ్మ. నీకు సరైనజోడి ఆమెను నీకు అర్పించ



ఖరుని సంహారం

డానికై తీసుకురావాలని వెళ్ళాను. నా ముక్కు, చెవులు కోసి పంపారు. అప్పుడు మన ఖరదూషణాదులు వారిపై దండెత్తారు. ఆ ఇద్దరు మగరాయుళ్ళు వారినందరినీ. చంపారు. ఇకనైనా నువ్వు జాగ్రత్తపడు. ఆమెను ఎలానైనా తెచ్చి యేలుకో .”

శూర్పణఖ మాటలు రావణునిలో ఆగ్రహాన్ని రేకెత్తించాయి. సీతపట్ల ఆశలు కలిగించాయి. సభ చాలించాడు మారీచుణ్ని పిలిపించాడు. తన మనసులోని కోరిక వివరించి యిలా అన్నాడు.



"రావణా! రామబాణం తిరుగులేనిది. నేను యిదివరకు ఆ మహావీరుని బాణం దెబ్బతిని సముద్రంలో తలదాచుకొన్నాను. నువ్వు ఈ ఆశ వదులుకో."

అప్పుడు రావణుడు కోపగించి "మానవాధములకు భయపడడమా? నామాట వింటావా? లేక వధింపనా?" అన్నాడు.

రావణుని చేతిలో చావడంకన్నా రామబాణానికి ఆహుతి కావడం మిన్న అని తలచి మారీచుడు బంగారులేడి రూపం ధరించి పంచవటికి వచ్చాడు.

అక్కడ సీతాదేవి దృష్టిని ఆకర్షిస్తూ తిరగసాగాడు. ఆ లేడి వన్నెచిన్నెలు చూసి సీత దానినిపట్టి తెచ్చియివ్వమని కోరింది. బంగారులేడి లోకంలో వుండదని, ఇదేదో రాక్షసమాయ అయి వుంటుందని రాముడు యెంత చెప్పినా సీత వినలేదు. విధిలేక రాముడు సీతారక్షణ భారాన్ని లక్ష్మణునకు అప్పగించి బంగారు లేడివెంట బాణం గురుచూసి పరుగుపెట్టాడు.

లేడి పరుగుపెట్టి పరుగుపెట్టి చాలాదూరం పారిపోయింది. ఎంతకూ అది దొరకకపోవడంతో రాముడు బాణాన్ని గురిచూసి వదిలాడు. ఆ బాణం గురితప్పక మాయాలేడికి తగిలింది. అది నేలకూలుతూ మారీచుడుగా మారి "హా! సీతా! హా! లక్ష్మణా!" అని అరచి ప్రాణాలు విడిచింది.


రాక్షసమాయ గుర్తించిన రాముడు వెనుదిరిగి ఆశ్రమం వైపు రాసాగాడు.

# కపట సన్యాసి

సీత ఆశ్రమం అరుగుపై నిలబడి రామునికై నిరీక్షిస్తున్నది. లక్ష్మణుడు బాణంవేపున ధరించికావాలి కాస్తున్నాడు. ఎంతసేపటికీ రాముడు రాలేదు. సీతకు బెంగగా వుంది. ఇంతలో "హా! సీతా! హా! లక్ష్మణా!" అన్న ఆర్తనాదం వినపడింది. అది అచ్చం రాముడు వేసిన కేకవలే వుంది.

ఆ కేకవిని సీత అదిరిపడింది. లక్ష్మణుడు మాత్రం ఎటువంటి తొట్రుపాటు లేకుండా వున్నాడు. అప్పుడు సీత యిలా అంది.

"లక్ష్మణా! ఈ దండ కారణ్యంలో యే రాక్షసుడు మీ అన్నగారికి ఆపద తెచ్చిపెట్టాడో! ఆర్తనాదం విని కూడా నువ్వు ఎక్కడ కంగారుపడక, అలా నిశ్చలంగా వుండిపోయావేమిటి? దీనినిబట్టి నీకు నాపై మోహం వున్నట్లు



మాయవేషంలో రావణుడు

అనిపిస్తోంది. నీ సోదర ప్రేమ నిష్కల్మషమైనదైతే వెంటనే వెళ్ళి నీ అన్నగారి ఆపద యేమిటో చూసి, ఆయనను ఆదుకొని తీసుకురా."

వదినగారి మాటలకు లక్ష్మణుడు నొచ్చుకొన్నాడు. ఏం చెప్పినా వినే స్థితిలో లేదు సీతాదేవి. అందుచేత వెళ్ళక తప్పదు.

అప్పుడు లక్ష్మణుడు ఆశ్రమ ప్రాంగణంలో ఒక రేఖ గీసి ఆ రేఖ దాటి రావద్దని సీతకుచెప్పి, ఆర్తనాదం వినవచ్చిన దిశగా అడవిలోనికి వెళ్ళిపోయాడు.


లక్ష్మణుడు కనుచూపు మేరం వెళ్ళేసరికి ఒక సన్యాసి ఆశ్రమందగ్గరకు



సీతాపహరణం

వచ్చాడు. "భవతి భిక్షాందేహి" అని అరిచాడు. సీత భిక్షతెచ్చింది. సన్యాసి అక్కడ గీచిన గీటుదాటి లోపలకు రాబోయాడు. మంటలు లేచాయి. వెనుకడుగు వేశాడు. సీత సందేహించింది. భిక్ష తీసుకొని గీటు దాటి వెలుపలకు రావడమా? మానడమా? అని ఆలోచించింది.

సన్యాసి తను నిలిచినచోటు నుంచి కదలలేదు. విధిలేక సీత భిక్ష వేయాలని 'లక్ష్మణరేఖ' దాటివచ్చింది. అంతే! మరుక్షణంలో ఆమెను ఎత్తుకొని ఆ కపట సన్యాసి ఆకాశానికి యెగిరాడు.



రావణుని నెదిరించిన జటాయువు

అతడు యెవరోకాదు, పదితలలు రావణుడు. ఆమె చేసేదేమీలేక విలపించ సాగింది.

# జటాయువు

ఆ దీనాలాపాలు విన్న జటాయువు అనే పక్షి రావణుని పరాగతాన్ని అరికట్టాలని ఆకాశానికి యెగిరి, రావణునితో యుద్ధం చేసింది. రావణుడు జటాయువు రెక్కలు నరికాడు. ఆ పక్షి రామనామం జపిస్తూ నేలకూలింది.



జటాయువు పరామర్శ

రావణుడు ఆకాశమార్గాన సీతను దక్షిణదిశగా తీసుకుపోయాడు. అప్పుడు ఆమె తన ఒంటిన మిగిలిన నగలుతీసి మూటకట్టి జార విడిచింది. (వివాహిత స్త్రీ

విధిగా కొన్ని ఆభరణాలను ఒంటికి ధరించి వుండాలని శాస్త్ర వచనం. ఇప్పుడు ఆ ఆభరణాలనే సీతతీసి విడిచిపెట్టింది) ఆ నగలమూట వానరజాతి వుంటున్న కొండ దగ్గర పడింది.



కబంధుడికి మోక్షం

రావణుడు సీతను అపహరించుకొనిపోయిన కొద్దిసేపటికి రామ, లక్ష్మణులు ఆశ్రమానికి వచ్చారు. అక్కడ సీత కనిపించకపోవడంతో కలతచెంది ఇద్దరూ వెతుకుతూ ముందుకు సాగారు.

దారిలో వారికి జటాయువు కొనవూపిరితో కనిపించి సంగతిచెప్పి ప్రాణాలు వదిలాడు. రాముడు జటాయువు మృతికి విచారించి, అంత్యక్రియలు జరిపాడు.

తర్వాత జటాయువు చెప్పిన దిశగా ముందుకు సాగారు. మార్గంలో వారికి కాళ్ళు, చేతులు వుండి, తల కడుపులోవున్న కబంధుడు అనే రాక్షసుడు ఎదురు పడ్డాడు. అతడు వారిని భక్షించాలనుకొన్నాడు. అయితే వారిద్దరూ అతణ్ని సంహ రించారు.

రామబాణం సోకగానే కబంధుడికి శాప విమోచనం అయింది. అతనికి గంధర్వరూపం వచ్చింది. అతడు రామునికి నమస్కరించి యిలా అన్నాడు :

"శ్రీరామచంద్రా! ఇదంతా రావణపాలిత ప్రాంతం. అయితే ఋష్యమూక పర్వత ప్రాంతం మాత్రం వానరజాతి ఆధీనంలో వుంది. వారి సహాయాన్ని పొందు."

కబంధుని మాటల్ని విని రామలక్ష్మణులు ముందుకు సాగారు.

## శబరి

ధనుర్బాణాలు ధరించి నడిచి వెళుతున్న రామలక్ష్మణులకు మహాభక్తు రాలైన ముసలి శబరి కనిపించింది. రామ సందర్శనంకోసమే ఆమె జీవించివుంది. దివ్య మంగళ విగ్రహ స్వరూపుడైన రామునిచూసి ఆమె కనులు ఆనందాశ్రువులు వర్షిం చాయి. గొంతు గద్గదమయింది. ఆ రామయ తండ్రిని తన కుటీరానికి తీసుకొనివెళ్ళి తేనెల చవులూరించే తియ్యటిపళ్ళు ఫలహారం పెట్టింది. ఆ పంపానదీ తీరాన శబరి ఏరి తెచ్చిన పళ్ళు ముందుకొరికి, రుచియైన వాటినే రామయ్యకు అందించింది. పుల్లటి పండ్లను పారవేసింది. ఎంగిలి పండ్లే అయినా నిర్మలమైన భక్తితో సమర్పించి నందుకు రాముడు వాటిని నోరారా, కడుపారా భుజించాడు. శబరి భక్తికి సార్థకత్వం చూపాడు.

శబరిని అనుగ్రహించి సీతను వెతుకుతూ రాముడు ముందడుగువేశాడు. లక్ష్మణుడు అనుసరించాడు.



శబరి ఆతిధ్యం

ఇది అరణ్యకాండం

## కిష్కింధా కాండ

రాముడు, లక్ష్మణుడు అలా నడిచివెళ్ళి ఋష్యమూక పర్వతం చేరారు. అది వానర రాజ్యం. వానరులు అంటే మనం యీనాడు చూస్తున్న కోతులుకావు.

అది ఒక జాతి. ఆనాటి వారికి తోకలుండి కోతిముఖాలుండేవి అందుకే వారిని వానరజాతి అని పేరుపెట్టారు. వారికి రాజు వాలి ఈ జాతినే "వానరులు" అంటారు.

ఒకసారి వాలి ఒక రాక్షసుడితో యుద్ధం చేస్తూ సంవత్సరాలపాటు గుహలో ఉండిపోయాడు. ఎన్నాళ్ళకు వాలి రాకపోయేసరికి వానర ప్రముఖులు అతడి తమ్ముడైన సుగ్రీవులకు పట్టాభిషేకం చేశారు.

కొన్నాళ్ళ తరువాత వాలి ఆ రాక్షసుణ్ణి చంపివచ్చాడు. సుగ్రీవునిపై ఆగ్రహించి, చావకొట్టి వదిలాడు. పైగా అతడి భార్య తారను తీసుకుపోయి రాజయ్యాడు. సుగ్రీవుడు రాజ్యంపోయి, భయభ్రాంతుడయి రుష్యమూకంమీద తన మంత్రి హనుమంతునితో మరికొందరు కపివీరులతో కాలం వెళ్ళబుచ్చుతున్నాడు.

వాలిని పరాభవించాలని రాజ్యాన్ని సంగ్రహించాలని అతడి ఆశయం, అయితే వాలి శక్తిముందు సుగ్రీవుని శక్తి చాలటంలేదు. అందుకే సమయం కోసం నిరీక్షిస్తూ సుగ్రీవుడు కాలం గడుపుతున్నాడు.

ఒకనాడు రుష్యమూక పర్వతంపై కూర్చుని హనుమంతునితో మాట్లాడుతున్న సుగ్రీవునకు లోయదారివెంట ధనుర్బాణాలు ధరించిన ఇద్దరు వీరులు రావటం కనిపించింది. వారు వాలి పంపగా తనను చంపడానికే వస్తున్నారని సుగ్రీవుడు భయపడి హనుమంతుని వారి సంగతి కనుక్కురమ్మని పంపాడు. ఆంజనేయుడు బ్రాహ్మణ బ్రహ్మచారిరూపం ధరించి రామలక్ష్మణుల దగ్గరకు వచ్చాడు.

## అగ్నిసాక్షిగా....

వానరజాతికి నిలయమయిన "కిష్కింధా" ప్రాంతంలో శ్రోత్రియ బ్రాహ్మణ బ్రహ్మచారి కనిపించటమేమిటని ఆ దారిన వస్తున్న రామలక్ష్మణులకు ఆశ్చర్యం కలిగింది. అప్పుడు హనుమంతుడు వారికి నమస్కరించి ఇలా అన్నాడు.

"మహాత్ములారా! మీరెవరు. మీ రూపాలుచూస్తే మునులవలెఉన్నారు. చేత ధనుర్బాణాలు చూస్తే క్షత్రియులవలె కనిపిస్తున్నారు. నేను ఆంజనేయుడు అను వాడిని. సుగ్రీవుని నమ్మినబంటును. మీ వివరాలు చెప్పండి."

అప్పుడు లక్ష్మణుడు యిలా సమాధానం చెప్పాడు.

“బ్రహ్మచారీ! ఈయన శ్రీరామచంద్రుడు అయోధ్యానగరవాసి. తండ్రి



సుగ్రీవునితో మైత్రి

ఆజ్ఞను అనుసరించి అరణ్యవాసానికి వచ్చాం. మా వదిన సీతమ్మను రాక్షసుడయిన రావణుడు అపహరించుకొని పోయాడు. ఆమెను వెతుకుతూ యిటు వచ్చాం.”

అప్పుడు హనుమంతుడు యిలా చెప్పాడు. “మహానుభావులారా! మా సుగ్రీవరాజుకూడా రాజ్యభ్రష్టుడై, భార్యను పోగొట్టుకుని వేదనపడుతున్నాడు. మీకూ, ఆయనకూ సామ్యం ఉంది. కనుక మీరు స్నేహితులయితే పరస్పరం సహకరించుకొనవచ్చు. రండి మైత్రి కల్పిస్తాను.”

హనుమంతుని మాటలు విని రామలక్ష్మణులు అతడిని అనుసరించి వెళ్ళారు.

సుగ్రీవుడు తన కథ చెప్పాడు. లక్ష్మణుడు తమ వృత్తాంతం వివరించాడు. ఆంజనేయుని హితవు మేరకు రామ, సుగ్రీవులు అగ్నిసాక్షిగా స్నేహం చేసుకొన్నారు.

## వాలి వధ

రాముని శక్తిపై సుగ్రీవునకు అనుమానం వుంది. వాయువేగంతో సంచరించే మహావీరుడయిన వాలిని ఈ మానవమాత్రుడు చంపగలడా అని అతని సందేహం. అదే విచారిస్తూ కూర్చున్న సుగ్రీవుని ఆంతర్యం గ్రహించిన రాముడు అక్కడపడి వున్న దుంధుభి కళేబరాన్ని కాలిబొటనవ్రేలితో విసిరేసరికి మహా పర్వతంవంటి కళేబరం ఆకాశానికి ఎగిరిపోయింది. వాలి చంపిన దుంధుభి రాక్షసుని కళేబరం అది.

ఆ తరువాత అక్కడ ఒకే సరుసలో బలంగా, ఏపుగా పెరిగిన ఏడు తాటి చెట్లను ఒకే బాణంవేటుకే పడగొట్టి తన బాహుబలాన్ని, అస్త్రవిద్యా నైపుణ్యాన్ని ప్రదర్శించాడు. దానితో సుగ్రీవునకు రాముని పరాక్రముంపట్ల నమ్మకం ఏర్పడింది.

మరునాడు సుగ్రీవుడు వాలి యింటి దగ్గరకు వెళ్ళి సింహగర్జన చేశాడు. యుద్ధానికి పిలిచాడు. వాలి ఒక్క ఉదుటున వచ్చి పిడికిలి గుద్దులతో సుగ్రీవుని మర్దించి పంపాడు. వాలి సుగ్రీవులు ఒకే రూపంలో వుండడంవల్ల వాలిని రాముడు గుర్తించలేకపోయాడు.

మరునాడు సుగ్రీవుని మెడలో దండవేసి పంపారు. సుగ్రీవుడు వచ్చి సమ్మం దగ్గర యుద్ధనాదం చేయడంతో వాలి ఆశ్చర్యపోయాడు. తార యుద్ధానికి వెళ్ళవద్దని వాదించింది. వాలి వినలేదు.

ఇద్దరూ ఘోరంగా యుద్ధంచేశారు. రాముడు చెట్టుచాటున నిలిచి వాలిపై వాడి బాణం వదిలాడు. ఆ మహావీరుడు నేలకూలాడు.

తార, అంగదుని తీసుకొని విలపిస్తూవచ్చింది. వాలి రామునికి వారిని అప్పగించి కన్నుమూశాడు.

తరువాత రాముడు సుగ్రీవుడికి కిష్కింధా రాజుగా పట్టాభిషేకం చేయించాడు. అంగదుని యువరాజుని చేశాడు. తార వాలి వద్దనే వుండసాగింది.



వాలి సంహారం

ఒకనాడు తీరికగా ఉన్న వేళ సుగ్రీవుడు తమకు దొరికిన నగలమూట చూపించాడు అవి సీతాదేవి ఆభరణాలని రామలక్ష్మణులు గుర్తుపట్టారు.

## ఆనవాలు

వర్షాకాలం వెళ్ళింది. శరత్కాలం వచ్చింది. రాముని ఆజ్ఞ ప్రకారం సుగ్రీవుని సలహాను అనుసరించి వానరవీరులు సీతాదేవిని వెతకడానికి బయలు దేరారు. సర్వసమర్థులయిన వానర శ్రేష్ఠులను తూర్పు, పడమర, ఉత్తరదిక్కులకు పంపారు.

దక్షిణ దిక్కుకు మాత్రం అంగదుడు, ఆంజనేయుడు మొదలైన వీరుల్ని పంపారు. వారివెంట జాంబవంతుడు ఉన్నాడు. నెలలోగా సీతాదేవి జాడ తెలియజేయాలని అందరికీ సుగ్రీవుడు ఆజ్ఞయిచ్చాడు.

ఆంజనేయునకు రాముడు తన ఉంగరాన్ని యిచ్చి సీత కనిపిస్తే ఆనవాలుగా యిమ్మన్నాడు.

సుగ్రీవుని దగ్గర సెలవు తీసుకొని, రాముని ఆశీస్సులు పొందిన వానర వీరులు కదిలిపోయారు. అంగదుని నాయకత్వంలో కపిశ్రేష్ఠులు దక్షిణ దిక్కుగా వెళ్ళారు.

## సముద్రం దాటాడు

అంగదుడు, జాంబవంతుడు, ఆంజనేయుడు ముందు నడవగా వానరులు కొన్నివందల యోజనాలు వెళ్ళారు. కొండలు ఎక్కారు. గుట్టలు దాటారు. లోయలు నడిచారు. ఎక్కడా వారికి సీతాదేవి జాడ కనిపించలేదు.

ఒకనాడు ఒకచోట కూర్చుని వారిలో వారు బాధపడసాగారు. వారి మాటలువిన్న సంపాతి అనే ముసలి గ్రద్ద నెమ్మదిగా వారి దగ్గరకు వచ్చి యిలా అంది.


"నాయనలారా! మీరు వెతుకుతున్న స్త్రీని రావణుడు యీ సముద్రం అవతల వున్న లంకలో దాచాడు. నా పేరు సంపాతి జటాయువు సోదరుణ్ని, ఒకనాడు సూర్యమండలం వరకు ఎగిరి ఆ వేడికి రెక్కలుకాలి యిక్కడ పడిపోయాను. సముద్రం దాటితేనే సీత జాడ తెలుస్తుంది."

సంపాతి మాటలు విన్న వానర వీరులకు ఆనందం కలిగింది. విచారం కలిగింది. సీత ఉనికి తెలిసిందని ఆనందం, సముద్రం దాటడం ఎలాగా అని విచారం.

అప్పుడు జాంబవంతుడే ఆంజనేయుని దగ్గరకు వచ్చాడు.

"ఆంజనేయా! దివ్యవరాలు పొందిన మహానుభావుడివి నువ్వే ఈ సముద్రాన్ని దాటి సీత జాడ తెలుసుకొని రావాలి లే! దివ్యరూపం ధరించు. అతిలోక పరాక్రమంతో విజృంభించు, రామకార్యాన్ని నెరవేర్చు."

జాంబవంతుని ప్రోత్సాహంతో ఆంజనేయుడు ప్రభాదివ్యకాయాన్ని



సముద్రం దాటుతున్న ఆంజనేయుడు

ధరించాడు. మహేంద్ర పర్వతంపై నిలిచాడు. "జై! జై! సియారామ్! అని నినాదం చేసి ఆకాశంపైకి ఎగిరాడు.

క్రింద కొండలు చూర్ణమైనాయి, పర్వతాలు కదిలాయి. చెట్లు నేల కూలాయి. మహేంద్రపర్వతంపై ఆంజనేయుడు చేసిన పదఘట్టన కంపనం తగ్గింది. ఆయన సముద్రంపై వేగంగా ఎగిరిపోతున్నాడు.


మార్గంలో సురస, సింహిక అనే రాక్షసుల్ని వధించాడు. ఆంజనేయుడు ఏ ఆధారం లేకుండా ఆకాశంలో వందయోజనాలు అంటే ఎనిమిదివందల మైళ్ళు ప్రయాణించి రాత్రి సమయానికి లంకలో త్రికూట పర్వతంపై దిగాడు.

ఇది కిష్కింధా కాండ

# సుందరకాండ

లంక బంగారు నిర్మితమైన భవనాలతో అలరారుతోంది. విశాలమయిన వీధులు, ముత్యాల దీపాలు, రత్నాల పందిళ్ళు, ఆలయాలలో ఘంటారావాలు, వేద ఘోషలు, అవినీతి లేదు. అక్రమాలు లేవు. సదాచారం నెలకొని ఉంది. గోబ్రాహ్మణ పూజాదికాలు నిర్విఘ్నంగా జరుగుతున్నాయి.

అర్ధరాత్రి అయ్యేవరకు ఆంజనేయుడు సువేలాద్రిపై కూర్చుని లంకానగర వైభవాన్ని తిలకించాడు. రావణాసురుని పాలన సామర్థ్యాన్ని అంచనా వేసుకొన్నాడు. అప్పుడు సూక్ష్మరూపం ధరించి లంకానగరంలో ప్రవేశించాడు సింహద్వారం నుండి లోపలకు వెళ్ళాలనుకొన్నాడు. కాని శత్రువర్గంలోనికి ప్రధాన



లంకిణీ వధ

ద్వారం ప్రవేశించరాదని రాజనీతి చెపుతోంది అందుకే సర్వధర్మమర్మాలు తెలిసిన హనుమంతుడు లంకానగరం ప్రహరీ గోడదూకి లోపలికి ప్రవేశించాడు.

రహస్యంగా సంచరిస్తున్న అతణ్ని చూసి ఒక రాక్షసి అడ్డగించింది. ఇద్దరికీ యుద్ధం జరిగింది. ఆంజనేయుడు తన విరాడ్రూపం ప్రదర్శించి ఆమెను వధించాడు. ఆమెకు రాక్షసిరూపం పోయింది. గంధర్వరూపం వచ్చింది. ఆంజనేయునకు నమస్కరించి యిలా అంది.

"నేను శాపం వలన రాక్షసి నయాను. ఇక్కడ లంకిణి అనే పేరుతో ఈ నగరానికి రాత్రిపూట కాపలా కాస్తున్నాను. మహాశక్తివంతుడైన వానరుని వలన నాకు శాపవిమోచనం అవుతుందని చెప్పారు. నాకు నిజస్వరూపం ఇచ్చావు ధన్యురాలను. నీకు జయమగుగాక."

తర్వాత ఆంజనేయుడు లంకానగరంలోని మేడలు, మిద్దెలు, ఆలయాలు, విద్యాలయాలు ఒకటేమిటి అన్నిచోట్ల సీతాదేవిని అన్వేషించాడు. ఎక్కడ ఆమె జాడ కానరాలేదు. రావణుని అంతఃపురం వెతికాడు. అక్కడ ఆ రాక్షస చక్రవర్తి రావణుని తల్పంపై ఒక దివ్యసుందర స్త్రీమూర్తి కనిపించింది. ఆమె "సీతాదేవి" కాదు కదా అనుకున్నాడు. అల్పమయిన తన ఆలోచనకు తానే బాధపడ్డాడు. "మహాపతివ్రత అయిన సీతాదేవి రావణుని శయ్యపై పరుండదు" అని తీర్మానించుకొని నగరం సమీపంలోని అశోకవనంలో సీతకై అన్వేషించసాగాడు.

## చూడామణి

హనుమంతుడు అశోకవనం అన్వేషిస్తూ శింశుపావృక్షం మీదకు వచ్చాడు. అక్కడ ఆ చెట్టు మొదనే అరుగుపై దీనమూర్తివలే స్త్రీ ఒకతె కూర్చుని ఉంది. జుట్టు విరబోసి ఉంది. మలిన వస్త్రం ధరించింది. రాహువు నీడపడిన చంద్రబింబం వలె ఆమె వదనం మ్లానమై కాంతిహీనంగా ఉంది ఆమె నోటివెంట అస్పష్టంగా "రామా! రామా!" అన్న పదాలు వెలువడుతున్నాయి.

ఆమె సీత అని హనుమంతుడు నిర్ధారించుకొన్నాడు. క్రిందకుదిగి ఆమెతో మాట్లాడాలనుకొన్నాడు.

ఇంతలో దూరంగా పెద్ద కోలాహలం వినిపించింది. కాగడాల కాంతి కనిపించింది. ఆపటాటోపం చూసి రావణుడే అక్కడకు వస్తున్నాడని హనుమంతుడు అనుకొని, ఏం జరుగుతుందో వేచిచూద్దాం అని చెట్టుకొమ్మపైనే ఉండిపోయాడు.

ఇంతలో పదితలల రావణుడు వచ్చాడు. భయంకర వికటాట్టహాసం చేశాడు మీసం మెలివేసి యిలా అన్నాడు.

"సీతా! లంకలో నిన్ను బంధించి పది మాసాలైంది. నీ రాముడు వస్తాడని నువ్వు వృథాగా ఆశలు పెట్టుకొంటున్నావు. ఈ లంకానగరం చేరడం మానవ మాత్రులకు సాధ్యం కాదు. రెండు నెలల గడువు యిస్తున్నాను. మనసు మార్చుకొని, నాకు వశం అయితే సామ్రాజ్య వైభవాలు అనుభవిస్తావు. లేదా శుష్కించి నశిస్తావు."

రావణుడు ఆ మాటలు అని వెళ్ళిపోయాడు. రాక్షస పరివారం అనుసరించారు. సీతను కావలికాస్తున్న స్త్రీ జనం నిద్రపోయారు.

అదే సమయం అని హనుమంతుడు "రామనామం" జపిస్తూ సీత ఎదురుగా



రావణ తృణీకారం

నిలిచి, సంగతి చెప్పాడు. రాముడు ఆనవాలుగా యిచ్చిన ఉంగరం యిచ్చాడు. సీత ఆనందించింది అప్పుడు హనుమంతుడు యిలా అన్నాడు.

"అమ్మా! నా వీపున కూర్చో. ఈ సముద్రాన్ని దాటి, నిన్ను నీ రాముని దగ్గరకు తీసుకు వెళతా"

అప్పుడు సీత యిలా అంది. "హనుమా! నీ శక్తిసామర్థ్యాలను శంకించడం లేదు. కాని రాముడు తన పరాక్రమాన్ని ప్రదర్శించి నన్ను విడిపించుకొని వెళ్ళాలి, నా ఆశయం ఆయనకు నివేదించు. నా గుర్తుగా చూడామణిని యివ్వు" అని సీత చూడామణి తీసి హనుమంతునకు యిచ్చింది.



సీత సన్నిధిన హనుమంతుడు

ఆంజనేయుడు సీత దగ్గర సెలవు తీసుకొని తిరుగుప్రయాణం అయ్యాడు. ఇంతలో అతనికి ఒక ఆలోచన వచ్చింది.

# లంకాదహనం

ప్రభువు చెప్పిన పనికూడా చేయలేకపోవడం అధముల లక్షణం. చెప్పినంత మేరకు పనిచేయడం మధ్యమ పురుష లక్షణం. చెప్పని పనిని కూడా. దూర దృష్టితో ఆలోచించి చేయడం ఉత్తమ దూత లక్షణం. అందుకే ఆంజనేయుడు సీత జాడ తెలుసుకొన్న తర్వాత రావణుని బలం అంచనా వేయాలని భావించాడు దానికి ఒక్కటే మార్గం.

అశోకవనాన్ని నాశనం చేస్తే రాక్షస సైనికులు తన మీదకు వస్తారు. అప్పుడు వారి శక్తియుక్తులు అంచనా వేయవచ్చు. వీళ్ళను అనుసరించి రావణుని కొలువు చూడవచ్చు.

హనుమంతుడు అశోకవనంలోని బురుజులు పడగొట్టాడు. చెట్లకొమ్మలు విరిచి చిందరవందరగా పడవేశాడు కొన్ని చెట్లను కూకటివేళ్ళతో పీకి పారవేశాడు.

అడ్డువచ్చిన భటుల్ని చంపాడు. ప్రహస్త కుమారుల గర్వం అణిచాడు. అక్షయ కుమారుణ్ని హతమార్చాడు. అప్పుడు ఇంద్రజిత్తు వచ్చాడు: బ్రహ్మాస్త్రాన్ని ప్రయోగించి ఆంజనేయుణ్ని బంధించాడు.

కొలువుకు తీసుకువచ్చాడు. ఆంజనేయుడు రావణుని దివ్య వర్చస్సును ఆశ్చర్యంగాచూశాడు. రావణుడు ఆంజనేయుడి వివరాలు తెలుసుకున్నాడు లంకా నగరానికి శోభ నిచ్చే అశోకవనాన్ని భంగపరచి నందుకు అతణ్ని చంపమని ఆజ్ఞాపించాడు.

అప్పుడు విభీషణుడు అడ్డుపడి యిలా అన్నాడు.

"అన్నా! దూతను చంపరాదు. అది అపరాధం. సకల రాజనీతి మర్మాలు తెలిసిన నువ్వు యీ సంగతి విస్మరించి, దూతను వధించమనడం తప్పు. అయితే అతడు మన వనాన్ని నాశనం చేశాడు కనుక అతడిని అవమాన పరచి పంపించు."

విభీషణుని మాటలు విని రావణుడు ఇలా ఆజ్ఞాపించాడు.

"రాక్షస సైనికులారా! తోక కోతిజాతి లక్షణం. తోకలేని కోతిని స్వజాతివారు పరిహసిస్తారు. కనుక ఈ హనుమంతుని తోకకు నిప్పు అంటించి పంపండి."



లంకా దహనం

రావణుని ఆజ్ఞను శిరసావహించి రాక్షస భటులు హనుమంతుని తోకకు నిప్పంటించి వదిలారు. ఆంజనేయుడు తన తోక కాలిపోకుండా కాపాడమని అగ్నిదేవుణ్ని ప్రార్థించాడు.

ఒక్క ఉదుటున ఆకాశానికి ఎగిరి లంకా నగరంలోని భవనాలకు నిప్పుపెట్టి లంకా దహనం చేశాడు. అనంతరం సముద్రంలో తోకను ముంచి మంట ఆర్పుకొన్నాడు. రామనామం జపించి సముద్రాన్ని దాటి ఇవతల తీరం చేరాడు. జాంబవంతాదులకు సీతాదేవి జాడ చెప్పాడు. అందరూ ఆనందంతో ఉత్సాహంతో కిష్కింధ చేరారు.

"చూశాను సీతను" అని రాములకు సీతామాత కుశలం చెప్పి ఆమె

యిచ్చిన చూడామణిని అందజేశాడు. లంకానగరం విశేషాలు వివరించాడు. రావణు సీతకు రెండు నెలలు వ్యవధి యిచ్చి హెచ్చరించడం సంగతి చెప్పాడు.

విభీషణుడి ధర్మనిరతిని ప్రశంసించాడు. అంతపై దండెత్తి సీతాదేవిని విడిపించుకొని రావాలని వానర వీరుల సమక్షంలో రాముడు నిశ్చయించాడు. సుగ్రీవుడు వేగుల్ని పంపి సమస్త, వానర ఋక్షజాతుల వీరుల్ని కిష్కింధకు రావించాడు. కిష్కింధలో సమర సన్నాహం పూర్తి అయింది.

ఇది సుందర కాండం.


# యుద్ధకాండం

ఎంత కపి సైన్యం! ఎందరు మహావీరులు! ఎంతటి భల్లూక సైన్యం! ఎందరు భల్లూక వీరులు అందరికీ అంగదుడు నాయకుడు. సుశేషుడు వైద్యాధికారి. నలుడు, నీలుడు, జాంబవంతుడు, గయుడు, గవాక్షుడు, గోముఖుడు, యిలా ఒక్కొక్కరి ఆధీనంలో కపివీరుల్ని నూరేసికోట్లు వుంచారు. అందరూ సుగ్రీవరాజు ఆజ్ఞను శిరసావహించి సముద్రంవైపు పయనం సాగించారు.

అక్కడ లంకలో రావణుడు కొలువుతీరి వున్నాడు. వేద విదులైన పురోహితులు, హితైషులు, విభీషణాదిబాంధవ సోదరులు కొలువులో వున్నారు. సామాన్యమైన ఒక కోతి సముద్రాన్ని దాటి లంకలో ప్రవేశించి, నానా భీభత్సం సృష్టించడం యేమిటి దీని పర్యవసానం యెలా వుంటుంది? మనం ఎలా చేయాలి? వీటి గురించి రావణుడు చర్చిస్తున్నాడు. అందరు తలోక విధంగా సలహా చెప్పారు. చివరకు విభీషణుడు యిలా అన్నాడు.

రావణా! ఒక కోతి సృష్టించిన కల్లోలం చూశాం. రాముణ్ని సామాన్యుడైన మానవమాత్రుడిగా పరిగణించవద్దు అతడు శివధనుస్సును విరిచిన వీరుడని విన్నాం. పరశురాముని గర్వాన్ని హరించిన పరాక్రమశాలి అని తెలుసుకొన్నాం. అందుచేత జాగు చేయక సీతాదేవిని అతడికి అప్పగించి శరణు వేడడం మంచిది. అలాకాక అతనితో యుద్ధమే జరిగితే లంక సర్వనాశనం అయిపోతుంది.”

ఇలా విభీషణుడు ఎన్నో విధాల హితవు చెప్పాడు, కాని రావణుడు విన



విభీషణుని శరణాగతి

లేదు. పైగా స్వజనాన్ని కించపరచి, పరాయివాడిని స్తుతించాడన్న ఆగ్రహంతో విభీషణుణ్ని లంకనుంచి బహిష్కరించాడు.

## రామునితో స్నేహం

విభీషణుడు తల్లి కైకసి దగ్గరకు వెళ్ళాడు. సభలో జరిగిన వివరాలు చెప్పాడు. తాను యిక రాముని శరణు వేడతానని అనుమతిని యిమ్మని కోరాడు. ఆ మాతృమూర్తి ఆశీర్వదించి పంపింది.



సముద్రునిపై మోడ్పు

విభీషణుడు సముద్రందాటి ఈవలి తీరానికి వచ్చేసరికి రామలక్ష్మణులు సుగ్రీవాది వానరసైన్యంతో సాగరతీరం దాటే యోచన చేస్తున్నారు.

విభీషణుడు రాముని పాదాలు తాకి సమస్కరించి శరణువేడారు. అంగదాదులు అడ్డుచెప్పారు. కాని ఆంజనేయుడు విభీషణుని గుణగణాలు చెప్పాక రాముడు విభీషణుతో స్నేహానికి అంగీకరించాడు. లంకా విజయానికి విభీషణుడు సహకరించగలడని అందరూ ఆనందించారు.

సముద్రాన్ని దాటడం ఎలా అని ఆలోచిస్తున్నారు. పైగా సముద్రుడు తాలోత్తాలగా లేచి కెరటాలతో విజృంభించి నురగలు గ్రక్కుతున్నాడు. అప్పుడు


రాముడు తన యుద్ధయాత్రకు సముద్రుడు అడ్డం అని కోపగించి అతడిని పరాభవించాలని బాణం ఎక్కుపెట్టాడు.

## వంతెన

అప్పుడు సముద్రుడు భయపడి రాముని దగ్గరకు వచ్చి నమస్కరించి యిలా అన్నాడు.

“రామచంద్రా! మీ వానర సైన్యంలో నలుడు ఉన్నాడు. నేను నీకు సహకరించగలను.”

సముద్రుడు ఈ మాటలుచెప్పి మాయమయ్యాడు. వానర వీరులు తమ భుజశక్తిని అనుసరించి బండలు, కొండలు తీసుకురాగా నలుడు వంతెన నిర్మించాడు.




వంతెన నిర్మాణము

అందరూ "రామ" నామం ఉచ్చైస్స్వరంతో ఉచ్చరిస్తూ వంతెనపై నడిచి ఆవలితీరం చేరారు ఆ సాగరతీరాన శిబిరాలు నిర్మించుకొన్నారు.

## అంగద రాయబారం

యుద్ధానికి అన్ని ఏర్పాట్లు పూర్తి అయాయి. రాముడు యెత్తయిన ఆసనంపై కూర్చుని ఉన్నాడు. లక్ష్మణుడు ఆయన ప్రక్కన నిలబడి వున్నాడు. ఆంజనేయుడు వేవన వేస్తున్నాడు. అప్పుడు వానర వీరుల్ని ఉద్దేశించి సర్వయుద్ధ మర్మాలు తెలిసిన రాముడు యిలా అన్నాడు.

"కపిశ్రేష్ఠులారా! మనం యుద్ధం చేయడానికే కృతనిశ్చయంతో వున్నాం. అందుకు తగిన ఏర్పాట్లు పూర్తిచేసుకొన్నాం. అయితే ధర్మ సూక్ష్మం ఒకటి వుంది.



అంగద రాయబారం

ఆఖరిసారిగా రాయబారినిపంపి, రావణుని అంతర్యం తెలుసుకొని రావాలి. మన అభిప్రాయం చెప్పాలి. వారి అంతర్యం పసిగట్టాలి. రావణునికి మన అభిప్రాయం చెప్పాలి. రావణుడు శరణుజొచ్చి సీతను అప్పగిస్తే యుద్ధం అవసరం లేదు. యుద్ధం వలన ఎన్నో నష్టాలు వున్నాయి. ఎందరో మరణిస్తారు. ఎందరో వికలాంగులు అవుతారు. మహావీరుల్ని రణకాళి బలి తీసుకొంటుంది. వృధా రక్తపాతం మనం లక్ష్యం కాదు. కనుక అంగదుడు రావణుని ఆస్థానానికి వెళ్ళి మన అభిప్రాయం చెప్పిరావాలి.

రాముని ఆజ్ఞ తీసుకొని అంగదుడు రావణుని కొలువుకు రాయబారిగా వెళ్ళాడు ఇలా వివరించాడు.

"ఓ! లంకేశా! నేను వాలి కొడుకును. నన్ను అంగదు డంటారు. ఇప్పుడు రాముని దూతగా నీ ముందు నిలిచాను. నువ్వు రాముని శరణువేడి, క్షమాపణకోరి సీతాదేవిని అప్పగిస్తావా? లేక యుద్ధంలో శ్రీరామచంద్రుని బాణాలకు ప్రాణాలొడ్డుతావా? కనుక్కురమ్మన్నాడు మా ప్రభువు, రాముడు సామాన్యుడు కాడు. ఏడు తాళవృక్షాలను ఒకే బాణంతో నరికినవాడు. దుంధుభి రాక్షసుని భయంకర కళేబరాన్ని కాలిగోటితో ఆకాశానికి బంతివలె ఎగర గొట్టినవాడు. నా తండ్రి అమేయ బలపరాక్రమవంతుడు అయిన వాలిని చంపినవాడు. అటువంటి రామునితో యుద్ధంచేసి సర్వనాశనం కొనితెచ్చుకొంటావో! లేక స్నేహం చేసి సకల శుభాలు పొందుతావో? ఆలోచించు."

అంగదుని మాటలు విని రావణుడు వికటాట్టహాసం చేశాడు. కనుబొమలు ముడిపడ్డాయి. సభ అదిరిపోయేట్లు ఇలా అన్నాడు.

"అష్టదిక్పాలకుల తలలు వంచినవాణ్ని కుబేరుడ్ని కొల్లగొట్టినవాడ్ని కైలాసగిరిని భుజస్కంధాలపై నిలిపి పరమశివుడిని పూజించిన కుంభకర్ణాదిదానవ ప్రముఖులకు సోదరుణ్ని. మేఘనాథుని వంటి అవక్ర విక్రమునకు తండ్రిని, మానవాధముడయిన రామునితో నాకు స్నేహమా! అసంభవం! సైనికులారా! ఒక మానవమాత్రుణ్ని నా సమక్షంలో కిర్తించిన యీ దుస్సాహసిని బంధించండి."

రావణుని మాటలు విని రాక్షస సైనికులు ముందుకువచ్చి అంగదుణ్ని బంధించబోయారు. కాని అతడు వారికా అవకాశం యివ్వకుండానే ఆకాశానికి ఎగిరి లంకా ప్రాసాదం అధిగమించి కపిసైన్యం విడిదిచేసిన శిబిరాల దగ్గర వాలాడు. రావణుని అహంకారం గురించి వివరించాడు. యుద్ధం తప్పదని, రాయబారం వృధా ప్రయాస అని చెప్పాడు.

## యుద్ధం

రాముని ఆజ్ఞమేరకు కపిసైన్యం యుద్ధగర్జనలు చేశారు. రాక్షస సైన్యం తక్కువన యేమీ తినలేదు. ఉభయసైన్యాలు హోరాహోరీ పోరాడాయి,

ఎందరో రాక్షస వీరులు నేలకూలారు. కపిసేనలు కూడా కొందరు నిహతులయ్యారు రాక్షససైన్యం కపివీరులధాటికి నిలువలేకపోతున్నది. పలుమార్లు పలాయనం చిత్తగించారు. చివరకు కుంభకర్ణుడు వచ్చాడు, లక్ష్మణుడు అతడిని వధించాడు.

ఈ వార్త విన్న రావణుడు మండిపడ్డాడు. అపర పరాక్రమవంతుడయిన ఇంద్రజిత్తును పిలిపించాడు. ఇంద్రజిత్తు సింహగర్జనచేసి యుద్ధానికి వచ్చాడు. లక్ష్మణుడు అతడికి ఎదురు నిలిచాడు. పద్నాలుగేళ్ళు బ్రహ్మచర్య దీక్ష పాటించిన వీరుడి చేతిలో తప్ప ఇంద్రజిత్తు మరణించడు. పైగా అతను శాంబరీ మాయలు తెలిసినవాడు.


## సంజీవి

ఇంద్రజిత్తు రకరకాల శస్త్రాలు ప్రయోగించాడు. లక్ష్మణుడు వాటిని తిప్పికొట్టాడు. అతడు పన్నిన రాక్షస మాయల్ని లక్ష్మణుడు దివ్యాయుధాలతో భిన్నం చేశాడు. చివరకు ఇంద్రజిత్తు ఆకాశానికి యెగిరి కనిపించకుండా యుద్ధం చేయసాగాడు అప్పుడు లక్ష్మణుడు అస్త్రం ప్రయోగించాడు ఇంద్రజిత్తు మాయ పటాపంచలయింది. ఆ అస్త్రం అతడి కంఠాన్ని ఖండించింది. ఇంద్రజిత్తు మరణించాడు.

ఈ వార్త విన్న రావణుడు క్రోధమూర్తి అయ్యాడు. దివ్యాస్త్రాలు తీసుకొని రథం అధిరోహించి బయలుదేరాడు. లక్ష్మణుడితో పోరు ఘోరంగా సాగింది. తన కుమారుని వధించిన లక్ష్మణునిపై శక్తిని ప్రయోగించాడు. ఆ దివ్యాస్త్రం లక్ష్మణుని నేలకూల్చింది. రావణుడు విజయగర్వంతో వెళ్ళిపోయాడు.

సోదరుడు పడిపోయాడని విన్న రాముడు చింతించాడు. అప్పుడే చీకటి పడింది. ఉభయపక్షాలు యుద్ధ విరామ భేరీలు మ్రోగించాయి.

అప్పుడు సుగ్రీవుడు వచ్చి "సంజీవకరణి"ని తీసుకువస్తే లక్ష్మణుడు బ్రతుకుతాడని చెప్పాడు. అప్పుడు ఆంజనేయుడు ఉత్తర దిక్కుకు పయనించి ద్రోణగిరికి చేరాడు. అక్కడ "సంజీవకరణి" యేదో అతనికి తెలియలేదు. అందుకని ఆ కొండనే పెల్లగించి తీసుకువచ్చాడు.



సంజీవిని తెచ్చిన హనుమ

సుషేణుడు ఆ వనౌషధం తీసి లక్ష్మణునకు చికిత్స చేశాడు. లక్ష్మణుడు మూర్ఛనుంచి మేల్కొన్నాడు మరల యుద్ధానికి సిద్ధం అయ్యాడు.

## రావణవధ

రావణుడు యుద్ధానికి మరల ఉద్యుక్తుడయ్యాడు. అతడికి లక్ష్మణుడు తిరిగి జీవితుడయ్యాడని తెలిసింది- అయినా యుద్ధంలో ఆటో యిటో తేల్చుకోవా లన్నదే రావణుని పట్టుదల.

మరల రణరంగానికి వెళ్ళబోతున్న భర్త దగ్గరకు మండోదరి వచ్చింది. రాముణ్ని శరణు వేడమని ప్రాధేయపడింది. రావణుడు వినలేదు. విజయమో! వీరస్వర్గమో తేలిపోవాలని సంకల్పించి యుద్ధ భూమిలో అడుగుపెట్టాడు.

రాముడు అతడికి ఎదురు నిలిచాడు. ఎన్ని రకాలునా ఆయుధాలు, అస్త్రాలు ప్రయోగించినా ఫలితం లేకపోతోంది. అప్పుడు విభీషణుడు రాముని దగ్గరకు వచ్చి "రామా! రావణుని నాభివద్ద అమృతకలశం వుంది. దానిని ఇంకిస్తే తప్ప రావణుడు మరణించాడు."

విభీషణుని మాటలు విని రాముడు ఆగ్నేయాస్త్రం ప్రయోగించాడు. అది రావణుని నాభి దగ్గర ఉష్ణాన్ని ప్రసరించి అమృతాన్ని ఆవిరి చేసేసింది. మరు క్షణంలో రాముడు రావణుని శిరస్సుకు గురిచూసి బాణం వదిలాడు. అది రావణుని శిరస్సును ఛేదించింది. రావణుడు నేలకూలాడు.


దేవతలు రాముని విజయానికి ఆనందించి పూలవాన కురిపించారు.

## అగ్నిపరీక్ష

రాముడు లంకా నగరానికి విభీషణుణ్ని రాజుగాచేసి, పట్టాభిషేకం చేశాడు. ఆ తర్వాత రాక్షస స్త్రీలు సీతాదేవిని శుచిస్నానాలు చేయించి రామునకు అప్పగించారు. హర్షధ్వానాలు చేశారు. అప్పుడు రాముడు సీతతో యిలా అన్నాడు :

"జానకీ! అయోనిజవైన నీకు ఈ మానుష ధర్మాలు వర్తించవు. కాని మన లోకంలో మర్యాదలు కొన్ని పాటించాలి. పదినెలల కాలం పరాయి రాజు

యింట ఉన్నావు. కనుక నిన్ను లోకం అనుమాన దృష్టితో చూస్తుంది అగ్ని ప్రవేశం చేసి నీ పాతివ్రత్యాన్ని చాటి చెప్పు.



రావణ సంహారం

రాముని ఆదేశానుసారం సీత అగ్నిలో ప్రవేశించింది. అగ్నిహోత్రుడు చల్లారాడు. అందరు అగ్నిపునీత సీతను కీర్తించారు రాముడు సీతాదేవిని సమాదర పరస్పరంగా కౌగిలి చేర్చుకొన్నాడు.

## పుష్పకం

ఆ తర్వాత రాముని ఆదేశాన్ని శిరసావహించి విభీషణుడు పుష్పక విమానాన్ని సిద్ధంచేశాడు. సీతారాములు, లక్ష్మణుడు, ఆ విమానం ఎక్కారు. తరువాత సుగ్రీవుడు, అంగదుడు ఆంజనేయాది కపిశ్రేష్ఠులు విభీషణాది రాక్షస ప్రముఖులు పుష్పక విమానం అధిరోహించారు. అది మనోవేగాన అయోధ్య వైపు పయనించింది. మార్గంలో దిగి భరద్వాజుని ఆశ్రమంలో విందారగించారు. ఆంజనేయుని నందిగ్రామం పంపారు. రామలక్ష్మణుల కుశల వార్తను, వస్తున్నారన్న వార్తను ఆంజనేయుడు ముందుగా భరతునకు చెప్పాడు. భరతుని ఆనందానికి అవధులు లేవు.

## రామరాజ్యం

సీతారామ లక్ష్మణులు, భరతుడు అయోధ్య చేరారు. కౌసల్య, సుమిత్ర, కైకేయ మాతలు వారిని చూచి ఆనందించారు. కపివీరులతో రాక్షస ప్రముఖులతో నగరం కలకలలాడింది.

ఒక శుభముహూర్తాన, సీతారాములకు పట్టాభిషేకం జరిగింది.

రామరాజ్యం అవతరించింది. ప్రజలకు ఏమటువంటి బాధలులేవు. ప్రకృతి వైపరీత్యాలు లేవు. అకాలమరణాలు లేవు. ఆకలిదప్పులు లేవు. కరువు కాటకాలు లేవు. అంతా సుభిక్షం. అంతా ఆనందమయం. అదే రామరాజ్యం.

## ఉత్తరకాండ

పధ్నాలుగు లోకాలలో రాజరాజ్యం గురించిన ప్రశంసలే వ్యాపించాయి. సింహాసనం అధిష్ఠించినప్పుడు, స్వపర భేదాలులేని ధర్మమూర్తి, కుటుంబ వ్యవహారాలు వచ్చినప్పుడు కల్మషంలేని కారుణ్యమూర్తి. అంతఃపురం చేరినప్పుడు భార్యను అలరించే ప్రేమైక శృంగార స్వరూపుడు. ఆశ్రితుల పాలిట యమపాశం. ఏ కోణంనుంచి చూసిన రాముడు ధర్మస్వరూపుడు.



శ్రీరామ పట్టాభిషేకం

ఈ మాటే అందరి నోట వినవస్తున్నది, అయినా ప్రజలు తన పాలన గురించి యేమనుకొంటున్నారో, వారి ఆశయకాంక్షలు ఎలా మారుతున్నాయో తెలుసుకొనడం రాజు బాధ్యత. అందుకే రాజు గూఢచారుల్ని ఉపయోగిస్తుంటాడు.

## ప్రజావాక్కు

రాముని గూఢచారులకు నాయకుడు భద్రుడు. ప్రతిరోజు అర్ధరాత్రి దాటిన తరువాత అతడు రాముణ్ని కలుసుకొని, ప్రజల అంతర్యాలు విప్పి చెప్పేవాడు. అలాగే ఒకనాటి రాత్రి భద్రుడు రాముని రహస్య మందిరంలో కలిశాడు చాలా దీనంగా యిలా విన్నవించాడు.

“ప్రభూ! రామరాజ్యంలో న్యాయానికి, ధర్మానికి పెద్ద పీట అని అందరు అంటున్నారు. కాని నలుగురు కలిసినచోట, నాలుగు బాటల కూడలిలో మాత్రం ఒక అపశ్రుతి వినవస్తున్నది, పరాయివాడి యింట దాదాపు పది నెలలు గడిపిన సీతను తెచ్చి రాముడు యేలుకొంటున్నాడు అని. అగ్నిపునీత అయిన జానకీదేవి పవిత్రతను లోకం పసిగట్టలేకపోతోంది. ఇది రాముని ధర్మ స్వరూపంపై రాహుచ్ఛాయలు ప్రసరిస్తున్నది.

భద్రుని మాటలు విని రాముడు విచలితుడయ్యాడు. అంతలోనే తమాయించుకొన్నాడు. భద్రుణ్ని పంపివేశాడు. లక్ష్మణునికి వార్త పంపాడు. అన్న... కాదు రామచంద్రప్రభువు ఆజ్ఞ అందుకొని లక్ష్మణుడు వచ్చి నమస్కరించి నిలిచాడు. ధీరగంభీరమూర్తి రాముడిలా అన్నాడు :


“లక్ష్మణా! శరత్కాల పూర్ణిమ కాంతివంటి రఘువంశ యశస్సుకు కళంకం వచ్చింది. దానిని పరిహరించుకోవాలి. ఈ కళంకం మీ వదిన సీతవల్ల వచ్చింది కనుక “నిండు చూలాలు” అని సందేహించక మా ఆజ్ఞను శిరసావహించి ఆమెను అడవులలో వదలి రా!”

లక్ష్మణుడు విచలితుడయ్యాడు. రాముని మాటలేదుదనగాలు కా.పై

జానకీదేవి అడవుల అందం చూడాలని కోరింది. ఆ వాక్కుతో ఆమెను అడవులలో విడిచిరమ్మని అన్నగారి ఆజ్ఞ.

## కుశలవులు

తెల్లవారింది. లక్ష్మణుడు సీతాదేవిని రథంపై కూర్చుండబెట్టుకొని గంగా తీర ప్రాంతాలలోని అడవులకు పయనమైనాడు. ఆమె మనస్సు పరిపరివిధాలా



లవకుశల రామాయణ గానం

కీడును శంకిస్తున్నది. అయినా అడవుల భయంకర, రమణీయతను చూడాలన్న కోరిక ఆమెకు ఎక్కువగా ఉంది.

లక్ష్మణుడు గంగాతీరం వద్ద ఒక అడవిలో రథం ఆపాడు. సీతను దిగమన్నాడు. ఆమె దిగింది. అయోనిజయై, ఆదిశక్తివలె ప్రకాశిస్తున్న ఆమెకు నమస్కారం చేశాడు. తరువాత యిలా అన్నాడు.

"అమ్మా! ప్రజలు వేసే నిందను రఘువంశస్థులు భరించలేరు. పైగా ప్రజావాక్కు వారికి శిరోధార్యం. అందుకే ఏ పాపం యెరుగని రామచంద్రప్రభువు ఆజ్ఞ కారణం పరులయింట వుండి వచ్చిన జానకిని రాముడు యేలుకొంటున్నాడని ప్రజలు అపవాదు వేశారు."

లక్ష్మణుడు యీ మాటలు చెప్పి పట్టరాని దుఃఖభారంతో అయోధ్యకు వెళ్ళిపోయాడు. సీత తనకు కలిగిన దుస్థితికి విలపిస్తూ, గంగాతీరాన దిక్కులు తోచక సంచరిస్తుండగా వాల్మీకి అటు వచ్చాడు.

నిండు చూలాలిని చూశాడు. తండ్రివలె ఆదుకొన్నాడు. ఆశ్రమానికి తీసుకువెళ్ళాడు. అభయం యిచ్చాడు. ఆశ్రయం కల్పించాడు. అక్కడ మునికాంతలు ఆమె సేవలు చేస్తున్నారు.

ఒకానొక శుభసమయంలో ఆమె కవల పిల్లలను ప్రసవించింది. వాల్మీకి మహర్షి వారికి కుశలవులు అని పేరు పెట్టారు. వారు శుక్లపక్ష చంద్రుని వలె దినదిన ప్రవర్ధమానులైనారు. పలుకు నేర్చారు. ములుకు పట్టడం నేర్చారు, పాట నేర్చారు, ఆట నేర్చారు, అన్ని విద్యలలోను ఆరితేరారు. వాల్మీకి వారికి రామాయణ కథాగానం నేర్పాడు. ఆశ్రమానికే కాదు, ఆ చుట్టుప్రక్కల జనపదాలకు, మున్యాశ్రమాలకు వారిద్దరు వెలుగైనారు.

## అశ్వమేధం

రాముడు లోలోపల సీత గురించి వేదన పడుతున్నా రాచకార్యాలలో ధీరోదాత్తంగానే వ్యవహరిస్తున్నాడు. కులగురువు, బ్రహ్మవిద్యావేత్త అయిన వశిష్ఠుల వారి ఆజ్ఞను అనుసరించి అశ్వమేధం తలపెట్టాడు. రావణబ్రహ్మహత్యాదోష పరిహారానికి, రాజ్య విస్తర్ణకు ఆ యాగం అవసరం అని వశిష్ఠుడు సలహా చెప్పాడు.

భార్యలేనివారు ఆ యాగం చేయరాదు. రాముడు యేకపత్నీవ్రతుడు. కనక ఆయన మరల వివాహం చేసుకోడు. మరి మార్గాంతరం! స్వర్ణ సీతను తయారుచేయించారు. బంగారు నిర్మితమయిన సీత విగ్రహాన్ని ప్రక్కన వుంచి, రాముడు అశ్వమేధానికి సంకల్పం చేశాడు.

మేలుజాతి గుర్రాన్ని వదిలారు. దానివెంట శత్రుఘ్నుడు వెళ్ళాడు. ఏ దేశం తిరిగినా దానిని పట్టుకొనే వీరుడే లేడు. అందరూ రామునికి దాసోహం అన్నారు. కాని గంగాతీర ఋష్యాశ్రమంలోని బాలకులు గుర్రాన్ని పట్టుకున్నారు.

## సీత వీరమాత

ఆ గుర్రం నుదుట పట్టంపై యిలా వ్రాసి వుంది. దానిని లవుడు చదివాడు.

"వీరపత్ని, వీరమాత అయిన కౌసల్యాదేవి కుమారుడు. రావణాది దుష్ట రాక్షస సంహారం చేసిన జగదేక ధనుర్ధరుడు శ్రీరామచంద్రప్రభువు విడిపించిన అశ్వం యిది. వీరుడైనవాడు పట్టుకొనవచ్చు."

అప్పుడు లవకుశులు యిలా అనుకొన్నారు.

"మన అమ్మ సీతాదేవి కూడా వీరమాత అన్న గౌరవం పొందాలి. కనుక దీనిని బంధిద్దాం. ఎవరు వస్తారో చూద్దాం. మన పరాక్రమం చూపిద్దాం తాతయ్య పేరు, అమ్మ పేరు సార్థకం చేద్దాం" అని గుర్రాన్ని బంధించారు.

గుర్రాన్ని మునిబాలకులు బంధించారని శత్రుఘ్నుడు సైన్యంతో యుద్ధానికి వచ్చాడు. కుశలవులు ఆ సైన్యాన్ని పరాజితం చేసి శత్రుఘ్నుణ్ని మూర్ఛపోయేలా చేశారు. ఈ మాట విన్న భరతుడు రంగలో ప్రవేశించాడు. అతడికీ అదేగతి పట్టింది.

అప్పుడు లక్ష్మణుడు సైన్యంతో వచ్చాడు. మేఘనాథాది రాక్షస ప్రముఖుల్ని సునాయాసంగా సంహరించిన ధనుష్కుడు లక్ష్మణుడు.

ఆ బాలకులలో సీతారాముల పోలికలు చూసిన లక్ష్మణుడు వారిపై అస్త్ర ప్రయోగించలేకపోయాడు. వారికి నయాన చెప్పి చూశాడు. అలాంటి గుర్ర

ఇస్తానన్నాడు. వారు వినలేదు. శాంతి వచనాలు వద్దన్నారు. చివరకు యుద్ధానికి తలపడ్డారు. లక్ష్మణుడు కూడా మూర్ఛపోయాడు.

## రామయతండ్రి

యుద్ధంలో మునిబాలకులు లక్ష్మణుని ససైన్యంగా ఓడించారని అయోధ్యకు కబురు అందింది. వశిష్ఠులవారి అనుమతి తీసుకొని రాముడే రథం ఎక్కాడు. సరాసరి యుద్ధరంగానికి వచ్చాడు. శంఖనాధం ధనుష్టంకారం చేశాడు.

ఎదురుగా లలిత పల్లవ కోమల శరీరాలతో క్షాత్రతేజం, బ్రహ్మతేజం సమపాళ్ళలో రంగరించి పోతపోసినట్లున్న బాలకులు ఇద్దరు విల్లమ్ములు ఎక్కుపెట్టి వున్నారు. స్త్రీ, బాల, వృద్ధులపై తాను బాణం ఎక్కుపెట్టరాదు.

అంతేకాదు రాముడి మనస్సు వారిని చూడగానే పుత్రవాత్సల్యంతో పొంగిపోయింది. ఆబాలకులు సైతం బాణాల్ని సంధించలేక పోతున్నారు. వారి ముగ్గురి చూపులలో ఆత్మీయానురాగాలు ప్రవహిస్తున్నాయి. వారిమనస్సులు మూగ బాసలాడు కొంటున్నాయి.

ఇంతలో ఈ సంగతితెలిసి వాల్మీకి సీతను తీసుకొని అక్కడకువచ్చాడు. కుశలవులు రాముని బిడ్డలని చెప్పాడు. అగ్ని సంస్కారం పొందిన ఆదర్శ స్త్రీ రత్నం జానకి అని, ఆమెను స్వీకరించమని రామునికి హితవుచెప్పాడు.

రామయతండ్రి అంగీకరించాడు. భార్యను, బిడ్డలను తీసుకొని అయోధ్య చేరాడు. అశ్వమేధాన్ని దిగ్విజయంగా పూర్తిచేశాడు. ఆ తర్వాత సర్వజన రంజకంగా చతుర్దశ భువన ప్రశంసార్హంగా పదకొండువేల సంవత్సరాలు రాజ్యపాలన చేశాడు. నాటికీ నేటికీ రామరాజ్యమే అందరికీ ఆదర్శం అయింది. రాముడు ఆరాధ్యుడయ్యాడు!

ఇది ఉత్తర కాండం.

## రామాయణ విజ్ఞానం

రామాయణంలో రాముని కథ, సీతారాముల కష్టాలు, రావణుని దౌష్ట్యం

లంకానగర వైభవ పతనాలు, వానరజాతి విశిష్టత గురించి తెలుసుకొన్నాం. ఇప్పుడు రామాయణంలోని పాత్రల ప్రాంతాల, నగరాల వివరాలు తెలుసుకొందాం.

సంస్కృత రామాయణం మొత్తం 24 వేల శ్లోకాలతో ఏడు కాండలుగా విలసిల్లింది. దీనిలో ప్రధానంగా వచ్చే పాత్రలు.

వాల్మీకి : మహాకవి, ఆదికవి, రామాయణకర్త, లవకుశులకు పాఠాలు చెప్పిన గురువు.

నారదుడు : బ్రహ్మ మానసపుత్రుడు, దేవర్షి, లోకోపకారమే జీవితధ్యేయంగా సంచరించే మహనీయుడు.

దశరథుడు : అయోధ్యానగరానికి చక్రవర్తి, మహాయోధుడు. సూర్యవంశ రాజుల కీర్తిని నిలిపినవాడు.

వశిష్ఠుడు : దశరథుని కులగురువు, బ్రహ్మర్షి, రాముని జగదేకవీరునిగా తీర్చిదిద్దిన గురువు.

జాబాలి : దశరథుని రాజ్యంలో మేధావి.

విశ్వామిత్రుడు : రాజర్షి మహాశక్తిసంపన్నుడు, రామ లక్ష్మణులకు దివ్యశక్తుల ప్రసాదించాడు.

శతానందుడు : జనకమహారాజుకు కులగురువు. ధర్మాధర్మ వివేచన చెయగల దిట్ట.

కౌసల్య : కోసలదేశ రాజుకూతురు. దశరథుని పెద్ద భార్య రామునికి తల్లి అయిన జగదేకమాత.

సుమిత్ర : దశరథుని రెండవ భార్య. క్షమాగుణం మూర్తీభవించిన ఇల్లాలు, లక్ష్మణుని, శత్రుఘ్నుని ప్రసవించిన ఆదర్శమాత.

కైకేయి : దశరథుని మూడవ భార్య. కేకయరాజపుత్రి. భరతుని తల్లి.

మంథర : కైకేయికి అరణపుదాసి, అంతే పుట్టింటివారు పంపిన పరిచారిక.

సుమంతుడు : దశరథుని మంత్రులలో ముఖ్యుడు. రాముణ్ని అడవిలో దిగపెట్టి వచ్చినవాడు.

గుహుడు : నిషాదరాజు సీతారామలక్ష్మణుల్ని గంగ దాటించిన భక్తుడు.

అగస్త్యుడు : కుంభసంభవుడు. రామునకు దివ్యాస్త్రాలు ప్రసాదించిన మహర్షి.

అత్రి : బ్రహ్మర్షి. రామలక్ష్మణులకు దివ్య తత్వబోధ చేసిన పుణ్యమూర్తి.

భరద్వాజుడు : ఆనాడు ఆయన కులపతి. ఎందరో విద్యార్థులకు శస్త్ర శాస్త్ర విద్యా బోధన చేసినవాడు. భరద్వాజవిందు లోకప్రసిద్ధమైన విందు. ఆయన రాముడు వనవాసానికి వెళుతున్నప్పుడు కందమూల ఫలాలతో విందు చేశాడు. రావణునిచంపి అయోధ్యకు తిరిగి వెళుతున్నప్పుడు షడ్రసోపేతమైన విందు చేశాడు. ఇవి సందర్భోచితమైన విందులు. మొదటిది ముని కులానికి తగిన విందు. రెండవది రాజకులానికి తగిన విందు.

జనకుడు : మిథిలారాజ్యాధిపతి. రాజర్షి. సీతను పెంచిన తండ్రి. వేదాంతి.

సుమేధాదేవి : జనకుని భార్య. పేరుకు తగిన ఇల్లాలు.

శాంతాదేవి : దశరథుని కుమార్తె కాలక్రమంలో ఆమెను దశరథుడు రోమపాద రాజుకు దత్తు యిచ్చాడు.

ఋష్యశృంగుడు : విభాండకమహర్షి కొడుకు. దివ్యశక్తి సంపన్నుడు. శాంతాదేవికి భర్త. పుత్రకామేష్టి యజ్ఞానికి అధ్వర్యుడు.

అహల్య : బ్రహ్మ మానస పుత్రిక, గౌతముని భార్య. రామపాద స్పర్శతో పునీత అయిన సాధ్వి.

తాటకి : బ్రహ్మరాక్షసి. రామునిచే చంపబడినది.

సుబాహుడు : తాటకి కొడుకు. రామునిచే చంపబడ్డాడు.

మారీచుడు : సుబాహుని బావ. రామబాణం తగిలి, పారిపోయి సముద్రంలో దాగాడు. మాయలేడిగా వచ్చి రామునిచే చంపబడ్డాడు.

పరశురాముడు : విష్ణుమూర్తి అవతారం. ఇరవై ఒక్కసారులు రాచకులాన్ని నాశనం చేసినవాడు. రామునికి వైష్ణవ తేజాన్ని అందించి, తపస్సుకు వెళ్ళిపోయాడు.

శూర్పణఖ : రావణుని సోదరి. లక్ష్మణునిచే పరాభవించబడినది.

ఖరదూషణులు : రావణ పరివారంలో వారు, రామునిచే చంపబడ్డారు.

రావణుడు : లంకా సామ్రాజ్య చక్రవర్తి. కైకసి కుమారుడు. శివపూజా ధురంధరుడు.

విభీషణుడు : రావణుని సోదరుడు. ధర్మపరాయణుడు.

కుంభకర్ణుడు : రావణుని సోదరుడు, మహాబలవంతుడు.

ఇంద్రజిత్తు : రావణుని కుమారుడు. మహాపరాక్రమశాలి, మేఘనాధుడని ఇతడికి మరొక పేరుంది.

మండోదరి : రావణుని పట్టమహిషి, మయబ్రహ్మ కుమార్తె. మహాపతివ్రత సౌందర్యరాశి.

వాలి : వానర రాజు. ఇంద్రుని అంశతో జన్మించినవాడు, మహాబలవంతుడు.

సుగ్రీవుడు : వాలి తమ్ముడు. అగ్ని అంశతో పుట్టినవాడు. మైత్రికి, ఆజ్ఞా ప్రకటనకు పెట్టినది పేరు

హనుమంతుడు : అంజనీదేవికి వాయువు కృపవలన జన్మించినవాడు. మహాపరాక్రమవంతుడు, శక్తి సమన్వితుడు, నవవ్యాకరణ పండితుడు, చక్కటి దూత, భక్తి విశ్వాసాలకు హనుమంతుడే ఉదాహరణ.

జాంబవంతుడు : బ్రహ్మ అంశతో జన్మించినవాడు అతిబలవంతుడు. ఋక్ష జాతికి రాజు, యుక్తాయుక్త వివేచన చేయగల సమర్థుడు.

నలుడు : వానర రాజ్యంలో మంచి నేర్పరి అయిన స్థపతి. ఈనాటి భాషలో చెప్పాలంటే అతడు మేటి అయిన ఇంజనీరు. సముద్రంపై సేతువు కట్టించిన వాడితడే. సేతు నిర్మాణ విద్య యితడికి బాగా తెలుసు.

నీలుడు : వానర వీరులలో ప్రముఖుడు, బహు విద్యా నేర్పరి.

అంగదుడు : వాలి కొడుకు, మహావీరుడు. వానర రాజ్యానికి యువరాజు. కపి సేనాధిపతి.

గవయుడు : కపి వీరులలో ముఖ్యుడు.

గవాక్షుడు : కపి శ్రేష్ఠులలో వీరుడు.

సుషేణుడు : వానర రాజ్యంలో నిపుణుడైన వైద్యుడు. రామ-రావణ యుద్ధ సమయంలో వైద్య శిబిరాలలో యితడే ప్రధాన వైద్యుడు.

రాముడు, లక్ష్మణుడు, భరతుడు, శత్రుఘ్నుల వివరాలు, సీతా, ఊర్మిళ, మాండవి, శ్రుతకీర్తుల గుణగణాలు రామాయణకథలో అంతర్లీనాయి. ఇక ఇప్పుడు రామాయణంలో వచ్చే కొన్ని ప్రాంతాల వివరాలు తెలుసుకొందాం.

అయోధ్య : రఘు వంశస్థుల రాజధాని ప్రస్తుతం ఉత్తరప్రదేశ్‌లో వుంది. ఇక్కడ గంగానది ప్రవహిస్తోంది. దీనినే సరయూ నది అని కూడా పిలుస్తారు.

మిథిల : జనక రాజు రాజధాని, ప్రస్తుతం బీహార్‌లో వుంది.

పంచవటి : గోదావరీ తీరాన మహారాష్ట్రలో వుంది. రాముడు తన వనవాసకాలంలో పశ్చిమదిశగా వచ్చి దక్షిణానికి పయనించాడు.

దండకారణ్యం : వింధ్యకు దిగువ నుంచి దక్షిణ ప్రాంతం వరకు విస్తరించిన అడవి. ఇక్కడ అనేకులయిన రాక్షసులు ఉండేవారు. ఇక్కడే మున్యాశ్రమాలు ఉండేవి.

జనస్థానం : దండకారణ్యంలో ఘోరాకారులైన రాక్షసులు నివసించిన ప్రదేశం.

కిష్కింధ : దండకారణ్యానికి దిగువున, ద్రవిడ దేశం వరకు విస్తరించిన ప్రాంతం. కిష్కింధ మినహాయించి మిగిలిన దండకారణ్యంలో యెక్కువ ప్రాంతాన్ని రావణాసురుడు జయించి శూర్పణఖ పసుపు కుంకుమ క్రింద యిచ్చినట్లు ప్రతీతి. అందుకే శూర్పణఖ ఈ ప్రాంతాలలో ఉండేది. అంతేకాదు రావణ రాజ్యంపై ఉత్తరాదివారు కన్నెత్తి చూడకుండా రాక్షస గూఢచారులు ఈ అడవిలో తిరుగుతుండేవారు. రాముడు వచ్చేవరకు ఆర్యులు దక్షిణ దిగ్విజయం చేయలేదు. ఇది చారిత్రకులు చెప్పేమాట.

లంక : ఇది హిందూ మహాసముద్రంలో వుంది. ఇప్పుడు మనం శ్రీలంక అని పిలుస్తున్న దేశం మాత్రం ఆనాటి రావణలంక కాదు. ప్రస్తుతం

ఆస్ట్రేలియాగా పిలుపబడుతున్న "ఖండం ఆనాటి" లంక అని ఒక దంవా వుంది ఆనాడు ఆ ఖండం భారతదేశానికి 8100 మైళ్ళ (శతయోజనాల) దూరంలో ఉండేదట. కాలక్రమంలో సముద్రపు ఒరిపిడి, భూఖండాల కదలికవల్ల అదిదూరంగా జరిగిపోయింది.

ఆ లంకను కుబేరుడు మహావైభవంగా నిర్మించాడు. లంకా నగర విస్తీర్ణం యెనిమిది యోజనాలని అంటారు. అక్కడ అన్నీ బంగారు మేడలే. చక్కటి ఉద్యానాలు, తీర్చిదిద్దిన వీథులు, రక్షణ యేర్పాట్లు, లలిత కళల పోషణ-ఒకటేమిటి లంకానగరం వైభవాన్ని అంజనేయుడు, సుందరకాండలో అద్భుతంగా చెప్పుకొన్నాడు. అందుకే అటువంటి లంకను వదలవద్దని లక్ష్మణుడు అన్నప్పుడు శ్రీరాముడు యిలా అన్నాడు.

"అపిస్వర్ణ మయీ లంకానమే లక్ష్మణ రోచతే
జననీ, జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి"

"లక్ష్మణా! లంకానగరం స్వర్ణమయమే కావచ్చు కాని కన్నతల్లి మాతృదేశం స్వర్గం కన్న గొప్పవని మరిచి పోకు."

ఈ విధంగా రాముడు భారతీయులకు మాతృదేశ ప్రాశస్త్యాన్ని చాటిచెప్పి ఆదర్శ ప్రాయుడయినాడు.

## ఆనాటి ప్రపంచ పటం

రామాయణం కిష్కింధాకాండను కొంచెం శ్రద్ధగా పరిశీలిస్తే ఆనాటి ప్రపంచం (భూగోళం) పటం గుర్తుకువస్తుంది సీతను అన్వేషించడానికై సుగ్రీవుడు వానర వీరుల్ని సమీకరించాడు. వారందరిని ఉద్దేశించి తూర్పుదిశగా ఎవరు వెళ్ళాలో, పశ్చిమ తీరాన్ని ఎవరు అన్వేషించాలో, ఉత్తర భూముల్ని యెవరు వెదకాలో, దక్షిణ దిక్కున యెంతవరకు వెళ్ళాలో నిర్దేశించాడు.

అతడు ఆయా దిక్కులలో వచ్చే ప్రాంతాలు, ప్రదేశాలు, దేశాలు నదీ నందనవనాలు గురించి చేసిన వర్ణనల్ని బట్టి రామాయణ కాలంనాటి భూగోళం మనకు తెలుస్తుంది. ఆయా వివరాలతో కొందరు శాస్త్రవేత్తలు చరిత్రకారులు కొన్ని పటాలు తయారుచేశారు. "రామాయణ కాలీన భూగోళం" పేరున పుస్తకమే వెలువరించారు.

సుగ్రీవుడి వర్ణనలను బట్టి తూర్పున చైనా, పశ్చిమాన ఆఫ్రికా, దక్షిణాన ధ్రువ ప్రాంతం, ఉత్తరాన సైబీరియావరకు విస్తరించిన భూగోళాన్ని మనం అర్థం చేసుకొనగలుగుతాము ఈ వర్ణనల్ని కొంచెం భౌగోళిక విజ్ఞానంతో సరిపోల్చుకొనగలగాలి. వాల్మీకి రామాయణం వ్రాసేనాటికి తెలియవచ్చిన భూఖండం స్థితిని గ్రహించటానికి యిది ఉపకరిస్తుంది.

ఇదే విధంగా లంకానగరంలో ఆంజనేయుడు చూసి వర్ణించిన సంగతులు ఆనాటి ఆ ప్రాంతపు ఆచార వ్యవహారాలు గురించి తెలియజేస్తాను. అక్కడి పర్వతాలు, చెట్లు, లతలు, వనాలు అక్కడి భూభౌతిక వివరాల్ని సుబోధకం చేస్తాయి పంచవటి జనస్థానం, దండకారణ్యం, కిష్కింధ, మహేంద్రపర్వతం, సువేలాద్రి, మైనాకపర్వతం మొదలయినవన్నీ రామాయణకాలంనాటి భూగోళం స్థితి గతులను వివరించే విశేషాలే.

కథానుసారంగా వర్ణితమైన నదులు, నదాలు, వనాలు, ఉపవనాలు, కొండలు, అడవులు ఆ ప్రాంతాల జానపదుల జీవిన విధానాలు, మున్యాశ్రమాలు- రామాయణం ఒక మహాజాతి యొక్క సాంస్కృతిక చరిత్రను, భౌగోళిక యేకత్వాన్ని వివరించినదని అనిపిస్తాయి. ఈ రకంగా రామాయణం ఒక జాతి ఇతిహాసం. ఒక భూఖండపు సమగ్ర వివరణ యిచ్చిన చరిత్ర. అన్నింటినీ మించి ఆదర్శ సమాజపు రూపురేఖలు మనముందుంచిన దివ్య పురుషుడు రాముని చరిత్ర రామాయణం.

# సైనిక గూఢచారి వ్యవస్థ

రామాయణంలో సందర్భాన్ని బట్టి ఆ కాలపు సైనిక, గూఢచారి వ్యవస్థ స్వరూప స్వభావాలు, దౌత్యనీతి మర్యాదలు వర్ణితమైనాయి. దశరథుని కొలువులో ఎనిమిది మంది మంత్రులుండేవారు. ఇది అష్టప్రధాని వ్యవస్థ అన్నమాట. వీరు అతి కీలకమైన యెనిమిది శాఖల్ని నిర్వహించేవారు. ఒకరు శాంతిభద్రతలు మరొకరు రక్షణ, ఇంకొకరు ఆహారం, వేరొకరు ఆరోగ్య వ్యవహారాలు, మరొకరు విద్య, వేరొకరు సాంఘిక సమస్యలు, మరొకరు విదేశ వ్యవహారాలు, వేరొకరు గూఢచారి వ్యవహారాలు, చూసేవారు.

రాముడు చక్రవర్తి, వశిష్టుడు ప్రధాన న్యాయమూర్తి, భద్రుడు గూఢచారి శాఖకు అధిపతి. లక్ష్మణాదులు అంతరంగిక వ్యవహారాలలో సలహాదారులు. ఎవరెంతటి ఉన్నత పదవిని నిర్వహిస్తున్నప్పటికీ అందరూ రామాజ్ఞ

అలాగే వ్యూహాలు గురించిన వివరాలున్నాయి. శత్రువు ఒక రకమైన వ్యూహం పన్ని ముందుకు వస్తుంటే వారిని దెబ్బతీయడానికి ప్రతివ్యూహం పన్నటం ఆనాటి పద్ధతి. శత్రువు "నాగవ్యూహం" పన్ని ముందుకు వస్తున్నట్లయితే. ఆ వ్యూహాన్ని ఛేదించడానికై "గరుడ వ్యూహం" పన్నేవారు. "నాగవ్యూహం"అంటే పాము ఆకారంలో సేనని నడపడం అని ఒక అర్థం. కాని పాము ఏ గతిలో నడుస్తుందో పరుగు పెడుతుందో భయపెడుతుందో శత్రువుపై పడుతుందో ఆ రీతిగా సైన్యం నడవడం అని సైనిక విద్యాశాస్త్రవేత్తలు కథనం అలాగే"గరుడవ్యూహం" అంటే గరుడపక్షివలె సైన్యాన్ని అమర్చి నడపడం అని ఒక అర్థం. కాని సైన్యం "గరుడపక్షి" మాదిరిగా వేగంగా గురితప్పకుండా సంచరించడం అని అంతరార్థం.

ఇలా ఆనాడు సైనికుల చలన చాలనాలు నియంత్రితమై వుండేవి. ఆనాడు యుద్ధంవల్ల ఆ యుద్ధంలో సంబంధం ఉన్నవారు మాత్రమే ఎక్కువ నష్టపోయేవారు. కాని ఈనాటి యుద్ధనీతి, రీతి వేరు. యుద్ధంలో ఏ సంబంధం లేని ప్రజలు కూడా దెబ్బతినే యుద్ధతంత్రం ఈనాటిది. ఇది నాగరిక తంత్రమో, అనాగరిక తంత్రమో, అతినాగరిక తంత్రమో ఆలోచించాలి.

ఆనాటి యుద్ధాలలో యెక్కువగా "అస్త్రాలు శస్త్రాలు" ఉపయోగించేవారు. "అస్త్రం" అంటే మంత్ర శక్తిచేత ప్రయోగింపబడే ఆయుధం. "శస్త్రం" అంటే భుజశక్తిచేత ప్రయోగించే ఆయుధం. శస్త్రాలు మరల రెండు రకాలు అవి: 1. యాంత్రికం, 2. తాంత్రిక, కప్పీలు వంటి యంత్రాలచే ప్రయోగింపబడేవి యాంత్రికాలు, కేవలం భుజబలం బుద్ధిబలం వుపయోగించి, ప్రయోగింపబడేవి తాంత్రికాలు. ఇలా ఆనాటి యుద్ధ విద్యలు గురించి రామాయణంలో యెంతో విజ్ఞానం యిమిడి వుంది.

రామాయణ కాలంనాటి సైనిక స్కంధావారాలు గురించి కూడా తెలుసుకొందాం. సామాన్య సైనికగారాలు, సేనాధిపతుల శిబిరాలు, సర్వసేనాధిపతి శిబిరం గూఢచారుల గుడారాలు, చక్రవర్తి ఆంతరంగికుల శిబిరాలు, చక్రవర్తి అంగరక్షకుల డేరాలు. చక్రవర్తి శిబిరం యిలా అవి విభాగితం అయి వుండేవి. అలాగే అశ్వశాలలు, గజశాలలు, గజాశ్వరక్షకుల శిబిరాలు. విడివిడిగా నిర్మితమై వుండేవి. రథ సైన్యానికి ప్రత్యేక శిబిరాలు నిర్మించేవారు.

ఇవిగాక గాయపడిన గుర్రాలకు ఏనుగులకు చికిత్స చేసే గుడారాలు వేరుగా వుండేవి. రథాలు మరమ్మత్తులు చేసే వారికై ప్రత్యేక ఏర్పాట్లు వుండేవి. వీరికి యుద్ధవ్యూహాలతో ప్రత్యక్ష సంబంధంలేదు. కనుక శత్రువులు కూడా వీరి జోలికి వచ్చేవారు కారు. అలాగే గాయపడిన సైనికులకు చికిత్సలు చేసి సేదతీర్చే ప్రత్యేక వైద్య శిబిరాలు ఉండేవి ఇవి కూడా వర్గీకరింపబడి ఉండేవి. సామాన్య శిబిరాలు, అసామాన్య శిబిరాలు అని ప్రధానంగా రెండు రకాల శిబిరాలు ఉండేవి. సాధారణ వైద్య శిబిరాలలో సామాన్య సైనికులకు చికిత్స చేసేవారు. అంతేకాక చిన్న చిన్న గాయాలు వంటి వారికి యిక్కడ చికిత్స జరిగేది. అసాధారణ శిబిరాలలో ఉన్నత శ్రేణి సైనికాధికారులకు, రాజులకు చికిత్సలు చేసేవారు. అంతే కాదు పెద్ద పెద్ద గాయాలకు విరిగిన ఎముకలకు ఈ శిబిరాలలో చికిత్స జరిగేది. లక్ష్మణుడు మూర్ఛపోయినప్పుడు సుశేణుడు అతనికి సంజీవకరణితో యిటువంటి శిబిరంలోనే చికిత్స చేశాడు. ఆనాడు సుశేణుడు పేరెన్నికగన్న సైనిక వైద్యాధి కారి (మిలటరీ డాక్టర్ అన్నమాట.)

సుశేణుడు రెండురకాల ఔషధాలను ప్రధానంగా వాడినట్లు రామాయణం పేర్కొన్నది. అవి విశల్యకరణి, సంజీవకరణి, శల్యము అంటే ముల్లుబాణం బల్లెం, శూలం వంటి ఆయుధాల ములుకులు శరీరంలో గుచ్చుకొని వుండిపోతే వాటిని తీసి వేసి, వుపశమన కలిగించే ఔషధం లేదా ప్రక్రియ విశల్యకరణి. అస్త్ర శస్త్రాలవల్ల మనిషి స్పృహ కోల్పోయినట్లయితే అతడికి మరల స్మృతి తెప్పించి, దాదాపు నవ జవసత్త్వాలు యిచ్చే మందు లేదా చికిత్స పద్ధతి సంజీవకరణి. యుద్ధరంగంలో రెండు చికిత్సాల కన్న ఉపయోగించే ప్రక్రియలు ఏమీ వుండవు కద! అందుకే రామాయణంలో ఈ రెండు చికిత్సా విధానాల ప్రసక్తి వచ్చింది.

అలాగే ఎక్కువకాలం యుద్ధాలు లేదా ప్రయాణాలు చేయవలసివచ్చినప్పుడు మనిషి ఆకలిదప్పులు పీడించకుండా రక్షించే "బల-అతిబల" అనే యోగశాస్త్ర పరమైన విద్యలు గురించి విశ్వామిత్రుడు చెబుతాడు. ఈ విద్యల్ని సాధిస్తే ఆకలి దప్పుల బాధలుండవు. ఇలా రామాయణంలో యోగ విజ్ఞానశాస్త్ర ప్రశస్తి వస్తుంది.

యుద్ధ విద్యలు, వ్యూహ ప్రతివ్యూహాల సంగతి అలా వుంచి ఆనాటి భవన నిర్మాణ నగర నిర్మాణ పద్ధతులు గురించి కూడా రామాయణం విశేష వర్ణనలు

యిచ్చింది. ముఖ్యంగా లంకానగర వర్ణనం ఆదర్శపట్టణం నమూనాదా అనిపిస్తుంది. విశాలమైన వీధులు, అందమైన చతుష్పథాలు, రమణీయమైన ఉద్యానాలు, సమున్నతమైన భవనాల బారులు, క్రీడాంగణాలు, జలాశయాలు, దేవాలయాలు, లంకానగర వైభవాన్ని వేనోళ్ళ చాటుతున్నాయని హనుమంతుడు సుందరకాండలో వర్ణించాడు. అంతేకాదు, లంకానగరంలో అవినీతి, ఆశ్రిత పక్షపాతం వంటివి లేవంటాడు. అనాచారం, అత్యాచారం మచ్చునకైనా కనిపించవంటాడు. ప్రజలు సదాచార సంపన్నులని దైవచింతన, ధర్మచింతన గలవారని వివరిస్తాడు. రావణపాలితమైన లంకానగరం శత్రువులకు జయింప శక్యంకానంత రక్షణ పాటవం కలదని అంటాడు.

నగరాన్ని రక్షించే పెద్దగోడ. అగడ్తలు, బురుజులు, సైనిక కాపలా, రక్షణ వ్యవస్థ గురించి సుందరకాండలో విపులమైన వర్ణన లభిస్తుంది. లంకానగరమే ఆ రీతిగా వుంటే అయోధ్య, మిథిల వంటి రాచనగరుల వైభవ వివరం వేరుగా చెప్పనక్కరలేదు. ఇదే విధంగా కిష్కింధాప్రాంతం వర్ణనను బట్టి ఒక పర్వత దుర్గం నమూనాను మనం వూహించవచ్చు. ఈ విధంగా రామాయణంలో అయోధ్య వంటి మైదాన ప్రాంత రాజ్యం, లంక వంటి జలదుర్గం, కిష్కింధ వంటి పర్వత రాజ్యం నమూనాలను, వాటి వ్యవస్థలను వాల్మీకి మనకి అందించాడు. ఆయా రాజ్యాల జన జీవితాలను, ఆచార వ్యవహారాలను పౌరనీతి మర్యాదలను వివరించాడు.

ఆఖరుకు వంతెన నిర్మించే విద్య గురించి వివరించాడు. లంకానగరం చేరడానికై వానరసేనతో రాముడు బయలుదేరాడు. మార్గంలో సముద్రంపై సేతువు నిర్మించవలసి వచ్చింది. ఆ పనిని నీలునకు అప్పగించాడు. నీలుడు ఆనాడు కపి సైన్యంలో సేతు నిర్మాణవిద్య (ఇంజనీర్) తెలిసిన నిపుణుడు. ఏ రాయి సముద్రంపై తేలుతుందో ఏ రాయి మునిగిపోతుందో చెప్పగల దిట్ట. అందుచే అతడికి సేతుసంబంధన బాధ్యత అప్పగించారు. ఇలా రామాయణంలో ఎన్నో విద్యలు గురించిన ప్రశస్తి ఉంది.

శివధనుర్భంగం, సప్తసాలవృక్ష భేదనం వంటి ఘట్టాలు ఆనాటి వీరవిద్య పరీక్షలకు సంకేతాలు. సీతా స్వయంవర సమయంలో జనక మహారాజు తమ యింట తాత, ముత్తాతలనుంచి వున్న శివుని విల్లు యెక్కుపెట్టే పరీక్ష పెట్టాడు. ఆ ధనుస్సును సాధించగలవాడు బాహుబల విక్రముడని అర్థం. ఆ పనిని రాముడు చేశాడు. వింటికి నారి సారిస్తుండగా ధనుస్సు విరిగిపోయింది.

అలాగే కిష్కింధలో సుగ్రీవునకు రామునికి మైత్రి కుదిరింది. సుగ్రీవుడు తన గోడు వివరించాడు. వాలిని సంహరించాలన్నాడు. రాముడు అంగీకరించాడు. అయితే సుగ్రీవునకు రాముని భుజ పరాక్రమం పట్ల అనుమానం వచ్చింది. కిష్కింధలో అతిపెద్దదైన యేడు సాలవృక్షాలను చూపాడు. అవి వరుసగా వున్నాయి. ఒకే బాణం దెబ్బతో వాటిని ఖండించాలని రామునికి పరీక్ష పెట్టాడు. రాముడు గురిచూసి బాణాన్ని వదిలాడు. ఆ బాణం ఏడు సాలవృక్షాలను ఖండించింది. సుగ్రీవుడు రాముని భుజశక్తిని బాణప్రయోగ దక్షతను ప్రశంసించాడు.

మారీచ సుబాహుల శాంబరీ విద్యలు, మారీచుని మాయామృగ వేషధారణ వంటివి ఆనాటి రాక్షస విద్యలను గుర్తుకు తెస్తాయి. ఖరదూషణాదులు, కబంధుడు వంటి రాక్షసుల ఆకారాలు వికృతావయవాలతో జన్మించిన వారిని స్ఫురణకు తెస్తాయి. (ఈనాడు కూడా మనం అక్కడక్కడ వికృతమైన అవయవాలతో జన్మిస్తున్నవారి గురించి వార్తలు చదువుతున్నాం కదా.) అటువంటివారు నూటికి, కోటికి ఒకరిద్దరు వుంటారు. ఈ లోకసత్యాన్ని వాల్మీకి కబంధాది పాత్రలద్వారా మనకు స్పష్టం చేశాడు.

రామునివంటి చక్రవర్తి
సీతవంటి ఇల్లాలు
లక్ష్మణునివంటి సోదరుడు
భరత, శత్రుఘ్నులవంటి తమ్ముళ్ళు
ఆంజనేయునివంటి సేవకుడు

ఈ లోకంలో వర్ధిల్లాలని ఈనాటికీ అందరూ ఆశిస్తూనే వున్నారు.

అదే రామాయణ కావ్యం విశిష్టత. అదే రాముడి ప్రత్యేకత.

ఇంతకన్న ఒక మహాకావ్యానికీ, కావ్య నాయకునికీ, ఆ కావ్య రచయితకు సార్థక్య మేమున్నది?

ఆ మహద్భాగ్యం వాల్మీకికే దక్కింది.

"కూజంతం రామ రామేతి మధురం మధురాక్షరమ్
అరుహ్య కవితా శాఖాం వందే వాల్మీకి కోకిలమ్"

* *
* * *
* *

# విద్యార్థినీ విద్యార్థులకు అమూల్యాల నేస్తాలు

ఇంగ్లీష్-తెలుగు డిక్షనరి
తెలుగు-ఇంగ్లీష్ ,,
హిందీ-తెలుగు ,,
తెలుగు నిఘంటువు
త్రిభాషా డిక్షనరి
ఇంగ్లీష్-ఇంగ్లీష్ డిక్షనరి
ఇంగ్లీష్-హిందీ ,,
హిందీ-ఇంగ్లీష్ ,,
రసాయన శాస్త్ర నిఘంటువు
జంతుశాస్త్ర నిఘంటువు
వృక్షశాస్త్ర నిఘంటువు
గణితశాస్త్ర ,,
భౌతికశాస్త్ర ,,
ఇంగ్లీష్ వ్యాసాలు-లేఖలు
హిందీ వ్యాసాలు - లేఖలు
తెలుగు వ్యాసాలు-లేఖలు
ఇంగ్లీష్ గ్రామర్
హిందీ గ్రామర్ (హైస్కూల్)
హిందీ గ్రామర్ (డిగ్రీ)
త్రిభాషా వ్యాకరణం

తెలుగు వ్యాకరణము
సులభ వ్యాకరణము
45 రోజుల్లో ఇంగ్లీషు
45 రోజుల్లో హిందీ
ఇంగ్లీష్ తెలుగు స్వబోధిని
గణిత ఒలింపియాడ్ (తెలుగు)
గణిత ,, (ఇంగ్లీష్)
గణిత సూత్రములు
గణితము-సమస్యలు-సాధనలు
ప్రాథమిక గణిత శాస్త్ర స్వబోధిని
అంక గణితం
గణితశాస్త్రం (బీజగణితం)
101 స్వయం ఉపాధి పథకాలు
ఫోటోగ్రఫీ నేర్చుకుందాం
తెలుగు సామెతలు
ఇంగ్లీష్ తెలుగు సామెతలు
మీ ఆంగ్ల పదజాలం
పెంపొందించుకోండి
1001 జోక్స్-జోక్స్-జోక్స్

# బాలసాహిత్యంలో - బంగారు మొలకలు

బాలానంద బొమ్మల షిరిడీ సాయిబాబా [2 భాగాలు]
" అరేబియన్ నైట్స్ అద్భుత కథలు [3 భాగాలు]
" షేక్స్పియర్ అద్భుత కథలు "
" బైబిల్ కథలు [2 భాగాలు]
" సింద్‌బాద్ సాహస యాత్రలు
" రాబిన్‌సన్ క్రూసో సాహస యాత్రలు
" డాన్ క్విక్సోట్ సాహస యాత్రలు
" రాబిన్ హుడ్ సాహస యాత్రలు
" రెండు మహానగరాల కథ
" డేవిడ్ కాపర్ ఫీల్డ్
" ఆలివర్ ట్విస్ట్
" రాజు - పేద
" ప్రపంచ అద్భుత కథలు [2 భాగాలు]
" పంచ తంత్రం
" రామాయణం
" భారతం
" భాగవతం
" దశావతారాలు
" శ్రీకృష్ణ లీలలు
" టిప్పుసుల్తాన్
" వీరపాండ్య కట్టబ్రహ్మన
" మర్యాద రామన్న కథలు
" అల్లావుద్దీన్ అద్భుత దీపం
" ఆలీబాబా 40 దొంగలు
" అక్బర్ బీర్‌బల్ వినోద కథలు
" భేతాళ కథలు
" తెనాలి రామకృష్ణ కథలు
" పరమానందయ్య శిష్యులు
" భట్టి విక్రమాదిత్యుల కథలు [2భాగాలు]
" అపూర్వ చింతామణి
" కాశీ రామేశ్వర మజిలీల కథలు
" గలివర్ సాహస యాత్రలు